
ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377

తూకం తప్పుతోంది..!

ప్రజల అవసరాలను ఆసరా చేసుకుంటున్న వ్యాపారులు మార్కెట్‌లో వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారు. తూకం, కొలతల్లో తేడాలు, నాణ్యత లేని సరుకులు, ఎలాంటి సమాచారం లేని ఆహార పదార్థాలు తదితరాలను విచ్చలవిడిగా తరలిస్తున్నారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇదే తంతు కొనసాగుతోంది. వెరసి వినియోగదారులు నిత్యం నిలువు దోపిడీకి గురవుతున్నారు. కొన్ని వాణిజ్య, వ్యాపార సంస్థలు తూకాల్లోనే కాదు.. వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి రకరకాల జిమ్మిక్కులతో వినియోగదారులను నిండా మోసం చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు రెచ్చిపోతున్నారు. నిత్యం తనిఖీలు చేస్తూ కఠినమైన కేసులు నమోదు చేసి.. అనుమతులు రద్దు చేయాల్సిన అధికారులు మొక్కుబడి చర్యలతో వదిలేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మార్కెట్లలో జరుగుతున్న మోసాలపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలనాత్మక కథనం.





- తూకంలో మోసాలు.. కొలతల్లో తేడాలు
- మోసపోతున్న వినియోగదారులు
- ఆర్టీసీ, రైల్వే స్టేషన్లు, థియేటర్లలో అధిక ధరలకు విక్రయాలు
- పట్టించుకోని అధికారులు

నంద్యాల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పల్లె, పట్టణం అనే తేడా లేకుండా బజారులో విక్రయించే కూరగాయలు, పండ్ల నుంచి బంగారు దుకాణాలు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్లు, సినిమా థియేటర్ల వరకు వినియోగదారులు నిత్యం దోపిడీకి గురవుతున్నారు. వ్యాపారుల మోసాలను ఎక్కడికక్కడ అడ్డుకోవాల్సిన తూనికల కొలతలశాఖ అధికారులు సైతం కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో అన్నింటా బహిరంగంగానే అధిక ధరల రూపంలో దోపిడీ జరుగుతున్నా.. ఆశాఖ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. దుకాణాల్లో వేసిన తూకాలను ఇంటికి వెళ్లి చూసుకుంటే.. చాలా వ్యత్యాసం ఉండటం గమనార్హం. ఇలా ఎక్కడికక్కడ వ్యాపారులు ఇష్టారాజ్యంగా దోపిడీకి పాల్పడుతున్నా వీటిని నియంత్రించాల్సిన అధికారులు సైతం మిన్నకుండిపోవడంతో పలు విమర్శలకు తావిస్తోంది. ప్రధానంగా జిల్లాలో కిరాణా షాపులు.. వస్త్ర దుకాణాలు.. ఫ్యాన్సీ స్టోర్స్ హార్డ్‌వేర్, బంగారు దుకాణాలు వంటివి జిల్లాలో అధిక సంఖ్య ఉన్నట్లు తెలుస్తోంది. వీటికితోడు చిరువ్యాపారులు కలుపుకుంటే.. లక్షల్లో ఉంటారని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. జిల్లాలో ఏడాదికి సుమారుగా 600కు పైగా కేసులు నమోదు కాగా.. అందులో ఎక్కువ శాతం తుకాల్లో వ్యత్యాసాలు కలిగిన కేసులు నమోదయ్యాయి. కొందరు అధికారులైతే తనిఖీల సమయంలో జరిమానాలు చెల్లించినా దానికంటే తక్కువ మొత్తానికి రసీదు ఇచ్చి తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శిస్తున్నారని సమాచారం.



తనిఖీ చేస్తున్న అధికారి

జిల్లాలో గత మూడేళ్ల కేసులు

సంవత్సరం	కేసులు	జరిమానాలు
2022-23	542	రూ.34 లక్షలు
2023-24	712	రూ.42 లక్షలు
2024-25	815	రూ.48 లక్షలు

అన్నింటా మోసమే..!

జిల్లా వ్యాప్తంగా ఎక్కడచూసినా వ్యాపారులు దోపిడీకి పాల్పడుతున్నారు. కూరగాయలు కాటాలతో తూకం వేస్తున్నారు. కొందరైతే ఎలక్ట్రానిక్ పరికరానికి ముందుగానే 100గ్రాములు తగ్గించి మోసాలకు పాల్పడుతున్నారు. కొన్ని దుకాణాల్లో కాటాపై ఉన్న పళ్లెం బరువును లెక్కించకుండా తూకంలో కలిపేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ల తూకంలోనూ వ్యత్యాసం కనిపిస్తోంది. దీనిపై వినియోగదారులు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. సిలిండర్లను తూకం వేసి ఇవ్వడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. రెండు నెలలు రావాల్సిన సిలిండర్ 40 రోజులకే ఆయిపోతోందని పలుచోట్ల మహిళలు వాపోతుండటం గమనార్హం.

అన్నింటా దందానే...

జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్లు, బంగారు దుకాణాలు, సినిమా థియేటర్లు ఇలా ఎక్కడిక్కడ తినుబండారులను ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు విక్రయించేస్తున్నారు. కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్ తదితర శీతల పానీయాల రూపంలో అధిక ధరలకు విక్రయించి వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతున్నారు. అక్కడక్కడ వినయోగదారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. సినిమా థియేటర్లలో కూల్‌డ్రింక్స్, పాప్‌కార్న్ వంటివాటిని ఎమ్మార్పీ ధరకు విక్రయించిన దాఖలాలే కనిపించడం లేదు. ఉదాహరణకు డోన్ బస్టాండ్‌లో అడ్రస్‌లేని ఓ కంపెనీ మజ్జిగ ప్యాకెట్ రూ.10, రూ.12 ప్రకారం అమ్మేస్తున్నారు. ఆ మజ్జిగ ప్యాకెట్‌పై ధర ఉండదు, మ్యానుఫ్యాక్చర్ డీటైల్స్, తయారీ, ఫాసీ ఆమోదం ఇలాంటి వివరాలు ఏవీలేకుండానే విక్రయించేస్తున్నారు.

కనిపించని ప్రమాణాలు..

ఘన పదార్థాలైతే కిలోలు, ద్రవ పదార్థాలైతే లీటర్లలో కొలుస్తారు. వీటికి నిర్దిష్ట ప్రమాణాలుంటాయి. అయితే కొందరు వ్యాపారులు జిమ్మిక్కులు చేస్తున్నారు. తూనికలు కొలత లశాఖ నిబంధనల ప్రకారం.. వ్యాపారులు తూకం రాళ్లకు, కాటాలకు ప్రతి రెండేళ్లకు ఒకసారి తూనికలు, కొలతల శాఖ అధికారుల నుంచి సీలు వేయించుకోవాలి. అదేవిధంగా ఎలక్ట్రికల్ వెయింగ్ మిషన్లకు ఏడాదికి ఒకసారి పరీక్ష చేయిం చుకోవాలి. ఎక్కడైనా ఏమైనా కాటాలలో తేడాలు వస్తే సరి చేయించుకోవాలి. చాలా మంది వ్యాపారులు వీటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

అధిక ధరలకు విక్రయిస్తున్నారు..



ఆర్టీసీ బస్టాండ్, సినిమా థియేటర్లు, రైల్వేస్టేషన్లలో ఎమ్మార్పీ కంటే తినుబండారాలు, కూల్‌డ్రింక్స్, వివిధ రకాలు స్నాక్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. చాలామంది వినియోగదారులు తరచూ మోసపోతూనే ఉన్నారు. మాంసం, కూరగాయాలు, ఎరువులు తదితర దుకాణాల్లో తక్కువ తూకాలతో వ్యాపారులు దోపిడీ చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇలాంటి వ్యాపారులపై చర్యలు తీసుకుని వినియోగదారులకు న్యాయం చేయాలి.

-వెంకట్

మోసాలు చేస్తే కఠిన చర్యలు



వ్యాపారులు వినియోగదారులపై మోసం చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా తూకాలు, కొలతల రూపంలో ఎలాంటి మోసాలు జరగకుండా తనిఖీలు ముమ్మరం చేస్తాం. అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకుంటాం. వినియోగదారుల ఫిర్యాదుపై మరింత వేగంగా స్పందించి చర్యలు తీసుకుంటాం. వినియోగదారులను మోసం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదు.

- జిలానీబాషా, అసిస్టెంట్ కంట్రోలర్, తూనికలు కొలతలశాఖ, నంద్యాల

ముంపు బాధితులను ఆదుకోండి

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి



కొత్తపల్లి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బొజ్జా దశరథరామిరెడ్డి

కొత్తపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు ముంపు బాధితులను ఆదుకోవాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శ్రీశైలం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం డ్యాంలో 854 అడుగుల వద్ద నీటి మట్టం ఉంటేనే రాయలసీమలోని బీడు భూములకు సాగునీరు అందుతుందన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం నందికొట్కూరు ప్రాంతంలో కేసీ ఆయకట్టు కింద ఉన్న సుమారు 50వేల ఎకరాలతో పాటు 66 గ్రామాలు సైతం ప్రాజెక్టు నిర్మానంలో ముంపునకు గురయ్యాయని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధికి త్యాగం చేసిన ముంపు ప్రాంతాల నిర్వాసితులను ప్రభుత్వం గుర్తించకపోవడంతో వారి జీవనం నేడు దుర్భరంగా మారిందన్నారు. 1986లో నాటి టీడీపీ ప్రభుత్వం 98 జీవో ద్వారా ముంపు ప్రాంతాల్లోని కుటుంబాల్లోని నిరుద్యోగులకు ఇంటికోక ఉద్యోగం నిర్ణయించినప్పటికీ కొద్ది మందికి ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ప్రాజెక్టు కింద ముంపునకు గురైన గ్రామాల్లో ప్రతి ఎకరాకు సాగునీరు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఉమారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు వైఎన్ రెడ్డి, సామాజిక రాయలసీమ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ నాగన్న, కొక్కెరంచ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, సాయిరాం, అయ్యపు రెడ్డి, శంకర్‌గౌడు, మహేష్, రహంతుల్లా, రాము,సాయి చరణ్, పెద్దరాముడు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లు



నంద్యాల రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో చోటుచేసుకున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని జిల్లావ్యాప్తంగా పోలీసులతో స్పెషల్ డ్రైవ్‌లు న్విహిస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా శనివారం తెలిపారు. జిల్లాలోని రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ముఖ్యమైన ప్రాంతాల్లో పోలీస్ జాగిలాలు, బాంబుస్క్వాడ్ బృందాలతో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది సహాయంతో నేషనల్ హైవేలు, బోర్డర్ చెక్‌పోస్టులు, లాడ్జీలలో తనిఖీలు చేపట్టామన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- టీజీవీ కళాక్షేత్రంలో ముగిసిన చంద్రబాబు జన్మదిన వారోత్సవాలు



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పత్తి ఓబులయ్య, టీజీ వెంకటేశ్, బీవీ రెడ్డి తదితరులు

ఇదేనా మానవత్వం..?

- ఆస్తి పంచుకుని అన్నను గెంటేశారు
- చెత్త దిబ్బలో వదిలేసిన సోదరులు
- ఆళ్లగడ్డలో అమానుష ఘటన





పశువుల దిబ్బలో జీవనం చేస్తున్న ఫకృద్దీన్

ఆళ్ళగడ్డ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అయినవాళ్లమన్నారు.. మెల్లిగా పంచన చేరారు. తర్వాత మొత్తం ఆస్తి లాగేశారు. ఇక ఆయన భారమనకున్నారు. రోడ్డుపాలు చేశారు. ఉన్న ఆస్తిని లాగేసుకుని సొంత తమ్ముళ్లు ఓ సోదరుడిని చెత్త దిబ్బలో వదిలేశారు. మానవత్వం మచ్చుకైనా లేని ఓ సంఘటన సజీవ సాక్ష్యంగా నిలిచారు నడిపి ఫకృద్దీన్. బాగా బతికిన ఆయన నేడు మండుటెండలో దీనావస్థలో చెత్తదిబ్బలో బతుకుతున్న ఫకృద్దీన్ దీన గాథ హృదయాలను కలిచి వేస్తుంది. ఆళ్లగడ్డ మండలం బాచేపల్లె గ్రామానికి చెందిన పెద్ద ఫకృద్దీన్, నడిపి ఫకృద్దీన్, చిన్న ఫకృద్దీన్ ముగ్గురు సోదరులు. వీరిలో పెద్ద ఫకృద్దీన్‌కు తొమ్మిది మంది సంతానం. చిన్న ఫకృద్దీన్‌కు ఐదుగురు సంతానం. నడిపి ఫకృద్దీన్‌కు భార్య పిల్లలు ఎవరూ లేరు. అప్పట్లో పెద్ద మనుషులు అన్నదమ్ముల ఆస్తి పంపకాల్లో నడిపి ఫకృద్దీన్‌కు ఐదు ఎకరాల పొలం, ఒక ఇల్లు ఇచ్చారు. నడిపి ఫకృద్దీన్‌కు.. చిన్నతమ్ముడు అతని కుమారులు అంటే చాలా ఇష్టం. భార్యపిల్లలు ఎవరూ లేక పోవడంతో చిన్న తమ్ముడు ఆస్తిపై కన్నేసి అప్పుడప్పుడు మద్యం తాగించి ఆస్తిని తన పేరున రాయించుకున్నాడు. ఈ నేపథ్యంలో నడిపి ఫకృద్దీన్ గ్రామపెద్దలను ఆశ్రయించడంతో పోలీసుస్టేషన్‌లో పంచాయితీ చేశారు. బాధితుడు చనిపోయేంత వరకు ఆలనాపాలనా చూసుకుంటామని తమ్ముడు, అతడి కుమారులు ఒప్పందం చేసుకున్నారు. అయితే నెల రోజుల క్రితం వయోభారంతో ఉన్న నడిపి ఫకృద్దీన్‌ను సొంత సోదరుడు పశువుల దిబ్బలో వదిలేశాడు. దీంతో వర్షం పడితే తడుస్తూ ఎండకు ఎండుతూ నరక యాతన పడుతున్నా నడిపి ఫకృద్దీన్‌ను ఎవరూ పట్టించుకోలేదు. ఆస్తి అంతా తమ్ముడికి ఇచ్చేశాడని, వారే చూసుకోవాలని పెద్ద సోదరుడు ఫకృద్దీన్ తేల్చి చెప్పేశాడు. ఆస్తి కోసం ఇద్దరు అన్నదమ్ములు తన సోదరుడిని పశువుల దిబ్బలో వదిలేయడంపై ప్రతి ఒక్కరూ అయ్యోపాపం అంటున్నారు. అన్నీ పోగొట్టుకొని ఒంటరిగా మిగిలిన ఫకృద్దీన్ ఆపన్న హస్తంకోసం ఉబికివస్తున్న కన్నీళ్లతో ఎదురుచూస్తున్నాడు.

వ్యాపారుల చేతివాటం

- ఆగ్రహించిన రైతన్న
- సెంట్రల్ వేర్‌హౌస్ వద్ద ఆందోళన
- సర్ది చెప్పిన అధికారులు



సెంట్రల్ వేర్‌హౌస్ వద్ద నిలిచిపోయిన రైతుల ధాన్యం వాహనాలు

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ వేర్ హౌస్ వద్ద కొంతమంది వ్యాపారులు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. కొన్ని ధాన్యం వాహనాలను లోపలికి అనుమతించి కాటా వేసే ప్రయత్నం చేశారు. రోజుల తరబడి ఎదురుచూసిన రైతులు విషయం గమనించి శనివారం ఆందోళనకు దిగారు. అధికారులు సర్దిచెప్పడంతో రైతులు శాంతించారు. ఇదిలా ఉండగా జిల్లాలో జొన్నలు పండించిన రైతులు ఆయా మండల కేంద్రాల్లో పంటను ఈ-క్రాప్ చేయించుకొని సంబంధిత రశీదులతో ట్రాక్టర్లు, లారీల్లో ధాన్యాన్ని నంద్యాలకు తీసుకువచ్చారు. గోదాముల్లో హమాలీలు లేకపోవడంతో వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. కొంతమేరకు ధాన్యాన్ని విక్రయించారు. క్వింటాలుకు ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధర రూ.3371ప్రకారం విక్రయించారు. అయితే రైల్వే వ్యాగన్‌లో వ్యవసాయ విత్తనాల ప్యాకెట్లు రావడంతో అక్కడి పనులకు హమాలీలు వెళ్లడంతో వేర్‌హౌస వద్ద రైతుల ధాన్యం బస్తాల అన్‌లోడ్ సమస్య తలెత్తింది. ఈ క్రమంలోనే దళారులు సీరియల్ ప్రకారంగా ఉన్న వాహనాలను కాకుండా వేరే వాహనాలను లోపలికి అనుమతించడంతో వివాదం తలెత్తింది. ఈ విషయంపై పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజునాయక్‌ను వివరణకోరగా హమాలీల కొరతతో పనులు నిలబడి పోయాయని, జిల్లావ్యాప్తంగా జొన్నల బస్తాలు ఉన్న దాదాపు 200వాహనాలు వచ్చాయని, సమస్యను పరిష్కరించి ఒకటి, రెండురోజుల్లో రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు.

నివేదికలు ఇవ్వండి



- తొమ్మిది అంశాలతో అభివృద్ధి ప్రణాళికలు
- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో శ్రీశైల క్షేత్ర అభివృద్ధిపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీశైల దివ్యక్షేత్రంతో పాటు చుట్టుపక్కల ఉన్న పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా, ఆహ్లాదకరంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు. అందుకు అవసరమయ్యే డాక్యుమెంట్లు, సర్వేనెంబర్లవారీగా విస్తీర్ణ వివరాలివ్వాలని ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం వసతి, క్యూలైన్లు, రవాణా, పార్కింగ్, ఇతర మౌలిక సదుపాయాల తొమ్మిది అంశాలతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆమె చెప్పారు. డీఆర్వో రామునాయక్, డీఎఫ్ఓ సాయిబాబా, శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, ఆత్మకూరు ఆర్డీవో అరుణజ్యోతి, ఇరిగేషన్ ఎస్ఈ శివప్రసాదరెడ్డి, పర్యాటక శాఖాధికారి సత్యనారాయణమూర్తి, ఏపీ టీడీసీ డీవీఎం లక్ష్మినారాయణ, పాల్గొన్నారు.

బాలికల సాధికారతకు కార్యాచరణ

- ఐసీడీఎస్ పీడీ డాక్టర్ నిర్మల
- కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల జోనల్ సదస్సు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కిషోర వికాసం కింద యుక్త వయస్సు బాలికల సాధికారతకు గ్రామాల్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కర్నూలు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల పేర్కొన్నారు. నగర శివారులోని జీవసుధ ప్రాంగణంలో కిషోర వికాసంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణకు కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల నుంచి నోడల్ ఆఫీసర్లు, సీడీపీవో, డీసీపీవోలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించడానికి అన్నిశాఖలతో కలిసి ముందుకు వెళ్లాలన్నారు. కడప జిల్లా జీసీడీవో అనిత మాట్లాడుతూ వివిధ శాఖల సమన్వయంతో జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కడప జిల్లా మెప్మా సీఈవో కల్పన మాట్లాడుతూ గ్రామంలో మహిళా సాధికారిత కోసం ఎస్‌జీ సంఘ సభ్యుల ద్వారా చర్చించాలన్నారు. కర్నూలు జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో హోంశాఖలో బాలల, మహిళల పరిరక్షణకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. అనంతరం యునెసెఫ్ ప్రతినిధులు జాన్స్, నరసింహమూర్తి, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ స్టేట్ ఆఫీసర్ కమల్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీపీవో టి.శారద, డీసీపీఓ సిబ్బంది శ్రీలక్ష్మి, దీప, గీతా, పద్మ, నరసింహులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



జోనల్ సదస్సును ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ నిర్మల

తుంగభద్ర తీరం సాహిత్యం

'ఆధునిక మహో భారతం' వర్తమాన భాష్యం

● ప్రజా చైతన్య కవిత్వం రాసిన గుంటూరు శేషేంద్రశర్మ



కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'బాబూ నీ చిన్ని కన్నీటి బిందువులో ఏ సముద్రం గర్జిస్తూ ఉందో నాకు తెలుసు, అందుకే నేను చెట్లకు మొరపెట్టుకుంటున్నాను...ఆకులు కాదు, తుపాకులు కాయండని' అంటూ నేటి ఆధునిక సామాజిక పరిస్థితులకు భాష్యం చెబుతారు 'ఆధునిక మహాభారతం' కవితా సంకలనంలో ప్రఖ్యాత కవి గుంటూరు శేషేంద్రశర్మ. కవిత్వం రాయాల్సింది ప్రజల కోసమేనని చెబుతూ 'ఒక అందమైన పోయెమ్ అంటే...దానికి ఒక గుండె ఉండాలి/అది కన్నీళ్లు కార్చాలి/క్రోధాగ్నుల్ని పుక్కిలించాలి/పీడితుల పక్షం అవలంబించాలి/మనిషి రుణం తీర్చుకోవాలి' అని సమాజంలో కవి బాధ్యతను తెలియజేస్తారు. ఈ ఆధునిక భారత పుస్తకం వ్యాస మహర్షి విరచిత 18 పర్వాల భారతం కాదు. దేశ ప్రజల కన్నీళ్లను, కష్టాలను, ఆవేదనను, చైతన్యాన్ని ఆవిష్కరించే నిజమైన ఆధునిక మహాభారతం. ప్రాచీన భారతం, ఉత్తర భారతదేశంలో పండిత భాషలో పుడితే, ఆధునిక మహాభారతం ప్రజల భాషలో పుట్టింది. వ్యాస భారతం భూమి కోసం జరిగిన యుద్ధమైతే, ఈ ఆధునిక మహాభారతం ప్రజానీకం తమ కోసం యుద్ధం చేస్తారు. కర్షకుడు పాలకుల కుతంత్రాల్లో చిక్కుకొని వ్యాపార సంస్కృతితో పోటీ పడలేక సంఘర్షణలో ఉన్న వ్యక్తికి సరైన దిశా నిర్దేశం చూపగలిగేది కచ్చితంగా కవి మాత్రమే అని చెబుతూ 'సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చొని మొరగదు/తుపాను గొంతు చిత్తం అనడం ఎరుగదు/పర్వతం ఎవడికీ వంగి సలాం చేయదు/ నేనంతా ఒక పిడికెడు మట్టే కావచ్చు/కానీ కలమెత్తితే ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది అనే కవిత విస్ఫోటనంలా పేలుతుంది. పేద ధనిక మధ్యగల వ్యత్యాసాన్ని చెబుతూ కొందరు పుట్టక ముందే గొప్పతనం వాళ్లను పరీక్షిస్తుంది/కొందరు చచ్చిన తర్వాత కూడా వాళ్లని గొప్పదనం పరీక్షిస్తుంది/ఒకడు పుష్పహారాల బరువుతో పొంగిపోతాడు/ఒకడు గాయాలు లెక్కపెట్టుకుంటూ ఉప్పొంగి పోతాడు అని తెలియజేస్తారు. శేషేంద్ర కవిగా సాగు చేసిన ఫలసాయమంతా ఒకచోట చేరిస్తే అదే 'నా దేశం నా ప్రజలు' అనే ఆధునిక మహాభారతం. నిరంతర శ్రమ ఫలితమే మానవ నాగరికత. నగరీకరణలో ఎక్కడ, ఎప్పుడు, ఎలా లోపం జరిగిందో తెలియదు గాని, దాని ఫలితంమే నేడు మనం చూస్తున్న అసమ సమాజం. ఎందుకిలా జరిగిందో ఊహించగలం. మనిషి స్వార్థం వల్ల, విశాల దృష్టి లేకపోవడం వల్ల, సంకుచితత్వం వల్లనే ఇదంతా అంటారు ఆయన. అలాగే దీనికి విరుగుడు కూడా ఆయన స్పష్టంగా చెప్పారు. ఈ దేశ నాగలి ప్రతీక, ఈ దేశపు ఆకృతి నాగలి. ఇవి రెండూ ఒకదాన్ని ఒకటి పోలి ఉంటాయి. జీవన కథానాయకుడు కర్షకుడే. అతడే ఈ దేశపు జీవన దాన ప్రభువు అని అంటూ రైతు నాగలి మోస్తున్నాడు/ క్రీస్తు శిలువ మోస్తున్నట్లు/ ఈ ఏడాది పైర్ల దుఃఖం తీరకపోతే వచ్చే ఏడాది ఇట్టి కొడవళ్లు పట్టుకున్న పిడికిళ్లే మొలుస్తాయి.. అని రైతుల గురించి వ్యథ చెందుతాడు.

ఆధునిక మహాభారతం చదివితే బానిస మనస్తత్వం కారణంగా వంగిపోయిన కాళ్లలో బలం వచ్చి మనిషి కాళ్లు నిటారుగా నిలుస్తాయి. ఈ కల నెరవేరడానికి ఆధునిక మహాభారతాన్ని ప్రజాపర్వం, సూర్యపర్వం, పశుపర్వం, ప్రవాహ పర్వం, ఆదర్శ పర్వం, ప్రేమ పర్వం, సముద్ర పర్వం, జ్యోత్స్న పర్వం, మౌక్తిక పర్వం, మయూర పర్వం అని ఆయన విభజించారు. దివంగత గుంటూరు శేషేంద్రశర్మ రవీంద్రనాథ టాగోరు తర్వాత నోబుల్ సాహిత్య పురస్కారానికి నామినేట్ చేయబడిన సాహిత్యవేత్త. పాఠకులకు కొసమెరుపు ఏమంటే... ఇంత మంచి పుస్తకాన్ని రాసిన రచయితను, ఎప్పుడో 30 ఏళ్ల కిందట అచ్చయిన పుస్తకాన్ని పునర్ముద్రించి, నేటి తెలుగు పాఠక లోకానికి అందజేసిన సినీ కథానాయకుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కుమార్‌కు కూడా కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



- మానుక్రింది వెంకటేశ్, తెలుగు ఉపాధ్యాయుడు, ఆదోని

విత్తనం నేను...!

విత్తనం నేను...
మట్టిలో పెడితే మొలకనై వస్తా
చారెడు నీళ్లు పోస్తే...పచ్చగా చిగురిస్తా
చెట్టునవుతా విరబూస్తా విరులనిస్తా...!

నెలతల నెచ్చెలినవుతా
ఫలాలనిస్తా ఆకలి తీరుస్తా
ధాన్యమిస్తా...ధనమిస్తా...
రైతు నేస్తాన్ని అవుతా...!

నీడను ఇస్తా...సేద దీరుస్తా
గాలిని
ఇస్తా...ప్రాణవాయువును
అవుతా
ఆయుర్వేద దేవతగా
ఆయువును పోస్తా
వన దేవతనై వరాలు ఇస్తా,
వర్షాలు కురిపిస్తా...!

ఎండిపోతే మీకు కలపనై
సహాయపడతా
మీ ఇంటి మూలస్తంభమై ఆసరానిస్తా
కాగితాన్ని అవుతా...కథల పుస్తకాన్ని
అయి మురిపిస్తా
మీ కోసమే జీవిస్తా...మీ కోసమే
మరణిస్తా...!

ప్రకృతిలో కలిసి ఉంటా..ప్రతి చోటా
చిగురిస్తా
నా ఉనికి మీ ఊరికే అందం...నా ఊహ
మదికి ఆహ్లాదం
పచ్చదనానికి మీరు ప్రతిన
బూనండి
హరిత విప్లవానికి పతిజ్ఞ
చేయండి...!!



- ధరిత్రీదేవి, కర్నూలు



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

పహల్గామ్ ఘటనపై కోటేష్ 'చిత్ర'నివాళి



పాకిస్తాను ఏకాకిగా చేయాలి అంటున్న చిత్రం

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల తూటాలకు 26 మంది భారతీయులు మరణించారు. ఈ దారుణ ఘటనను చిత్రకారుడు తన చిత్రంలో అద్భుతంగా చిత్రించి వారికి నివాళులర్పించారు. ఈ చిత్రంలో 26 మంది భారతీయులను చంపిన ఉగ్రవాదుల తలలను నరికి భరతమాతకు సెల్యూట్ చేసి చూపిస్తున్న భారత్ జవాన్, భారత మాత ఆనందంగా వీరజవాన్‌కు ఆశీస్సులు అందజేసినట్లు చూపించారు. అదేవిధంగా పాకిస్తాన్‌ను విష సర్పంగా పోలుస్తూ ఇండియన్ ఆర్మీ కాలితో పాక్ కాలనాగును తొక్కుతూ బులెట్ల వర్షం కురిపిస్తున్నట్లు చిత్రాన్ని గీశారు. యుద్ధానికి సిద్ధం అనేలా యుద్ధవిమానాలను కూడా చిత్రంలో చూపించారు. ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తున్న పాకిస్తాన్ విషసర్పాన్ని ముట్టుపెట్టాలి. ప్రపంచ పటంలో పాకిస్తాన్ లేకుండా చేయాలని చిత్రకారుడు కోటేష్ అభిప్రాయపడ్డారు.

నాటకం, సినిమా రెండు కళ్లు

కళ



కోర్టు సినిమాలో ప్రధాన పాత్రలో నటించిన సురభి ప్రభావతి



ఆమె సాత్వికాభినయం అనిర్వచనీయం.. వాచకం అద్భుతం.. ఆహార్యం బహు ప్రశంసనీయం.. వెరసి ఆమె నటనా కౌశల్యం శ్లాఘనీయం.. నవరసాలను కలబోసి ప్రభవించిన ప్రతిభాశాలి.. ఆమె పేరు సురభి వనారస ప్రభావతి. రంగస్థలంపై ఏ నాటకమైనా, సినిమాలో ఏ పాత్ర అయినా తనదైన ముద్రతో ప్రేక్షకుల హృదయాల్లో ఒక శాశ్వత స్థానం సంపాదించుకుంటున్నారు. సురభి నాటక సమాజం నుంచి ఆరంభమైన ఆమె నట జీవితం నాటక రంగంలో ముప్పయ్ ఏళ్లుపైగా కొనసాగగా, గత దశాబ్ది కాలంలో తెలుగు సినీ రంగంలోనూ అద్భుతమైన పాత్రలు పోషిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకత చాటుకుంటున్నారు. కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన సాంస్కృతిక వారోత్సవాల సందర్భంగా కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య దర్శకత్వంలో ప్రదర్శించిన 'జగదేక సుందరి సామా', 'శ్రీకృష్ణ కమలపాలిక' నాటకాల్లో ఆమె నటించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో ఆమె మాట్లాడారు. ఆ ఇంటర్వ్యూ విశేషాలు ఆమె మాటల్లోనే...!



కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మాది పౌరాణిక నాటక ప్రదర్శనల్లో ప్రపంచ ఖ్యాతి పొందిన సురభి కుటుంబం. అమ్మ కమలమ్మ, నాన్న కుమార్ బాబు ఇద్దరూ సురభి ఆర్టిస్టులే. భర్త నగేష్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. మా తాత పూర్ణ చంద్రశేఖర్ ప్రఖ్యాత నటులు. అలా ముప్పయ్ నలభై మంది కలసి నాటకం వేసి ఉమ్మడి కుటుంబం మాది. నేను 1980 జూన్ 27న పుట్టాను. అప్పటికే మా సురభి టెంట్లు, విలువైన సామగ్రితో పాటూ సర్వం అగ్నిప్రమాదంలో ఆహుతైంది. దీంతో ఎవరంతకు వాళ్లం నాటకాలు వెతుక్కుని వేసే పరిస్థితి ఉండేది. అలా మెదక్ జిల్లా చేగుంటలో స్థిర నివాసం ఏర్పరచుకున్నాం. కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల పెద్దగా చదువుకోలేదు. గుణసుందరి కథ అనే పౌరాణిక పద్య నాటకంలో చిన్న వేషంతో నేను రంగస్థలపై అరంగ్రేటం చేశాను.

● సూర్యకాంతం, ఛాయాదేవి చేసిన గయ్యాళి పాత్రల్లో నటించాలని ఉంది
● సినీ అవకాశాలు పెరిగినా రంగస్థలం నాకు అమ్మలాంటిదే
● ప్రముఖ రంగస్థల నటీమణి, సినీ క్యారెక్టర్ ఆర్టిస్టు సురభి ప్రభావతి

సినీ అవకాశాలు మంచి గుర్తింపు తెస్తున్నాయి...

ఇటీవల విడుదలైన 'కోర్టు' సినిమా నాకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఇందులో సినిమా మొత్తంగా పూర్తిస్థాయిలో నటించాను. అలాగే సాధారణ పేద వర్గాలకు చెందిన యువకుడి తల్లిగా మంచి పాత్ర లభించింది. 30కి పైగా చిత్రాల్లో నటించాను. ఇంకా నాలుగైదు చిత్రాల్లో నటిస్తున్నాను. అవి షూటింగ్స్ జరుగుతున్నాయి. నా సినీ రంగ ప్రవేశం 2008లో బతుకమ్మ అనే చిత్రం ద్వారా జరిగింది. అలాగే దొరసాని, మిడిల్ క్లాస్ మెలోడీలు, సురాపానం, మసూద, ఇంటింటి రామాయణం, దసరా, రాత్రి 7:11 గంటలకు, చాప్టర్ 1, బెదురులంక 2012, మధుమాసం, వ్యూహం, గుంటూరు కారం, ది ఫ్యామిలీ స్టార్, ఆరంభం, సరిపోదా శనివారం, ఆదిగురువు అమ్మ, ఆర్‌టీఐ, లైలా వంటి చిత్రాల్లో అవకాశాలు లభించాయి. నాటక సమాజం నుంచి రావడం సినిమాల్లో నటనకు అవకాశం సులువుగానే మారింది. అయితే నాటకం కన్నా, సినిమాల్లో నటించడం కష్టం.



నాటక రంగంలో సురభి జమునారాణి ప్రోత్సాహంతో...



మాకు పిన్ని వరుస అయ్యే ప్రముఖ రంగస్థల నటి సురభి జమునారాణి 'శశిరేఖా పరిణయం' పౌరాణిక పద్య నాటకంలో మంచి వేషం ఇచ్చారు. అందులోని పద్యాలు, నటన, హావాభావాలు నాకు మంచి పేరు తెచ్చాయి. అప్పుడే హైదరాబాద్‌కు చెందిన రసరంజని, ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ట్స్‌కో తదితర నాటక సమాజాలు సాంఘిక నాటకాల్లోనూ అవకాశాలు ఇచ్చాయి. అక్కడ కూడా మంచి పేరు వచ్చింది. దీంతో 2005 నుంచీ బిజీ ఆర్టిస్టుగా మారిపోయాను. ముప్పయ్ ఏళ్ల రంగస్థల నాటకాల్లో ఇప్పటి వరకు సుమారు 6 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాను. ఇంకా అనేక నాటకాల్లో నటిస్తున్నాను.

గయ్యాళి క్యారెక్టర్లు వేయడం ఇష్టం...

నాకు సినిమాల్లో గయ్యాళి క్యారెక్టర్లు వేయడం చాలా ఇష్టం. వాటి కోసం ఎదురు చూస్తున్నాను. సూర్యకాంతం, ఛాయాదేవి వంటి మహా నటీమణులు మళ్లీ రారు. వారి నటన ఇతరులు అనుకరించడం, అనుసరించడం అసాధ్యం. అలా ఒక స్థానాన్ని సంపాదించుకున్న నటీమణులు వారు. నాకు నటనలో వారే స్ఫూర్తి కూడా. అందుకే నాటక రంగంలోనైనా, సినీ రంగంలోనై గయ్యాళి అత్తలు, అమ్మల క్యారెక్టర్ల రావాలని కోరుకుంటున్నాను.



ఆరంభం చిత్రంలో ముఖ్య భూమిక పోషించిన ప్రభావతి

నాటక రంగంలో వరించిన పురస్కారాలు ఎన్నో...

నాటక రంగంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి 5 నంది పురస్కారాలు అందుకున్నాను. అందులో కర్ణార్జనీయం, విప్రనారాయణ రెండు నాటకాలను కర్నూలు టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో, పత్తి ఓబులయ్య దర్శకత్వంలో ప్రదర్శించాము. అలాగే తిరుపతి గరుడ పురస్కారాలు 6, ఒంగోలు ఎన్టీయార్ జాతీయ పురస్కారాలు 7 లభించాయి. మరెన్నో కళాసంస్థల వారు వివిధ పురస్కారాలు ప్రదానం చేశాయి. నాకు ఇంత భవిష్యత్తును ప్రసాదించిన నాటక రంగంలో కొనవూపిరి ఉన్నంత వరకు కొనసాగుతూనే ఉంటాను. ఉన్నంతలో సంతృప్తిగా జీవించడంలోనే గొప్ప ఆనందం ఉంది. ఈ సూక్తిని అన్ని వేళలా నమ్ముతాను. అదే ఆచరిస్తూ ఉంటాను.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్
● టీజీవీ కళాక్షేత్రంలో ముగిసిన చంద్రబాబు జన్మదిన వారోత్సవాలు



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, బీవీ రెడ్డి, పత్తి ఓబులయ్యతో సత్కారం పొందిన కళాకారులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో గాడితప్పిన రాష్ట్రాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి పథం వైపు తీసుకెళ్తున్నారని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ పేర్కొన్నారు. చంద్రబాబు దిశా నిర్దేశంతోనే రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుకు వెళ్తోందన్నారు. కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో వారం రోజులుగా కొనసాగిన ముఖ్యమంత్రి జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన టీజీ వెంకటేశ్, చిత్ర నిర్మాత బీవీ రెడ్డి సీఎం చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ చంద్రబాబు రాష్ట్ర పురోగతికి రోజుకు 20 గంటలు శ్రమిస్తున్నారన్నారు. చంద్రబాబు పనితీరు, అంకితభావంతో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఎన్టీఆర్ తర్వాత రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు తీయించిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. బీవీ రెడ్డి మాట్లాడుతూ 1982లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుల్లో తాను ఒకరినని గుర్తు చేశారు. 1988 వరకు పార్టీలో పనిచేసి, ప్రస్తుతం ఆధ్యాత్మిక, పారిశ్రామిక రంగంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు విద్వాన్ పత్తి ఓబులయ్య మాట్లాడుతూ వారం రోజుల్లో జిల్లాలోని వంద మంది కళాకారులకు, ఇటీవల ఉగాది, కందుకూరి పురస్కారాలు అందుకున్న కళాకారులు, సాహితీవేత్తలకు సత్కారాలు చేశామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జన్మదిన వజ్రోత్సవ వారోత్సవాలు నిర్వహించిన ఘనత టీజీవీ కళాక్షేత్రానికే దక్కుతుందన్నారు. చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషితోపాటూ కళారంగానికి అందిస్తున్న చేయూతను కళాకారులు జీవితాంతం గుర్తుంచుకుంటారన్నారు.

అలరించిన శ్రీవేంకటేశ్వర మహత్యం

టీజీవీ కల్చరల్ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో, ఆ సంస్థ అధ్యక్షుడు వీవీ రమణారెడ్డి దర్శకత్వంలో ప్రదర్శించిన శ్రీవేంకటేశ్వర మహత్యం భక్తిరస నాటకం ఆసాంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ నాటకంలోని కళాకారులను టీజీ వెంకటేశ్, బీవీ రెడ్డి, గ్రంథాలయ సంస్థ పూర్వ చైర్మన్ కేజీ గంగాధరరెడ్డిలు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీజీవీ కళాక్షేత్రంలో శనివారం నుంచి ప్రారంభించిన వేసవి శిక్షణ శిబిరాన్ని టీజీ వెంకటేశ్ ప్రారంభించారు. నటరాజ చిత్రపటానికి పూలదండలు వేసిన ఆయన చిన్నారులను ఆశీర్వదించారు.



శ్రీ వేంకటేశ్వర మహత్యం భక్తిరస నాటకంలో ఒక దృశ్యం

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెంచాలి

● ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలి
● అధికారులకు కలెక్టర్ రంజిత్ బాషా సూచనలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని పెంచాలని, ఈమేరకు రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రంజిత్ బాషా వ్యవసాయాధికారులను ఆదేశించారు. కర్నూలు నగరంలోని ఉద్యాన శాఖ భవనంలో శనివారం వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై గ్రూప్ కన్వీనర్, కో కన్వీనర్లకు, అధికారులకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ నిర్వహణను రైతులు మెరుగుపరుచుకోవడం, కూలీల ఖర్చులను తగ్గించడం, పంట నాణ్యత దిగుబడి పెంచడం, పురుగు మందుల వాడకాన్ని తగ్గించడం వంటి ఫలితాలు డ్రోన్ల వినియోగం వల్లే సాధ్యమవుతుందని అన్నారు. జిల్లాలో 38 రైతు గ్రూపులకు 38 డ్రోన్లను అందించాలని, వాటిలో మూడు గ్రూపులకు అనుమతులు కూడా ఇచ్చినట్లు తెలిపారు. త్వరితగతిన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయించి రైతుల చేత డ్రోన్ల వినియోగాన్ని తక్షణం చేపట్టాలని బ్యాంకర్ల ఏడీఎంలను ఆదేశించారు. ప్రతి మండలంలో ఒక ఆదర్శ గ్రామాన్ని తీర్చిదిద్దాలని, 12 ఎకరాల నుంచి 1000 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని అందులో వ్యవసాయ అనుబంధ శాఖల కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాల గురించి వివరించాలన్నారు. జేసీ డా.బి.నవ్య, జిలా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాఘవేంద్ర చౌదరి, ఎల్‌డీఎం రామచంద్రరావు, ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, డ్రోన్ల గ్రూప్ కన్వీనర్, కో కన్వీనర్లు రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సత్వర న్యాయం అందించాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది



ప్రసంగిస్తున్న కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

కర్నూలు లీగల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): న్యాయాధికారులు వివిధ చట్టాలపై అవగాహన పెంచుకుని సత్వర న్యాయం అందించాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి సూచించారు. నగరంలోని జిల్లా కోర్టులో శనివారం ఉమ్మడి కర్నూలు జిల్లా న్యాయాధికారుల వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో ప్రధాన భూమిక వహిస్తున్న లిమిటేషన్ యాక్టుపై న్యాయాధికారులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. విశ్రాంత న్యాయాధికారి మోహన్‌రావు, విశ్రాంత జిల్లా న్యాయాధికారి ఎస్.రజిని లిమిటేషన్ యాక్టుపై న్యాయాధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయాధికారులు కమలా దేవి, పీజే సుధ, డి.అమ్మన్నరాజు, పి.వాసు, ఎం.శోభారాణి, ఎన్.శ్రీవిద్య, ఎంవీ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అంతంత మాత్రమే..





రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. అయినప్పటికీ పలు కారణాల వల్ల ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. ముఖ్యంగా ప్రభుత్వాస్పత్రులు సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైద్యుల కొరత వేధిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 30 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్యశాఖలో రాష్ట్ర ప్రభుత్వం కఠినతర నిబంధనలు అమలు చేస్తుండటంతో వైద్యులు నిరాశ చెందుతున్నారు. ఉద్యోగులు ఎఫ్ఆర్ఎస్‌తో ఇక్కట్లు పడుతున్నారు. గతంలో క్షేత్రస్థాయి వారికి మినహాయింపు ఉండేది. ప్రస్తుతం దాని తొలగించి అందరికీ వర్తింపజేస్తున్నారు.

- సమస్యల్లో ప్రభుత్వాస్పత్రులు
- వేధిస్తున్న వైద్యుల కొరత
- వైద్యశాఖలో కఠినతర నిబంధనలు
- క్షేత్రస్థాయిలో అమలుకాని పరిస్థితి
- ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్ కష్టాలు
- చాలీచాలని భవనాల్లో విధులు
- ఇబ్బందుల్లో డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు వైద్యసేవలు అంతంత మాత్రమే లభిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆస్పత్రుల్లో అనేక మార్పులు తెస్తున్నా క్షేత్రస్థాయిలో అమలుకాని పరిస్థితి నెలకొంది. పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)ల్లో పనిచేసే వైద్యాధికారులు మొక్కుబడిగా వైద్యశాలలకు వెళ్లిపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పీహెచ్‌సీలో వైద్యుల కొరత వేధిస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన సేవలు అందించేందుకు ఒక్కొక్క పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను నియమించారు. నంద్యాల జిల్లాలో 59 పీహెచ్‌సీలకు 19 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో 14 మంది పీజీ కోర్సు చదవడానికి వెళ్లారు. కర్నూలు జిల్లాలోని 35 పీహెచ్‌సీల్లో 11 వైద్యుల పోస్టులు ఖాళీఉండగా.. 9 మంది పీజీ చదువుల కోసం వెళ్లడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో 30వైద్యుల పోస్టులు ఖాళీలు ఏర్పడటంతో గ్రామీణ ప్రాంతాల్లో సేవలు స్థంబించాయి.

ఎఫ్ఆర్ఎస్ కత్తి

ఉద్యోగులు ఖచ్చితమైన వేళకు విధులకు హాజరయ్యేలా వైద్యఆరోగ్య శాఖలో ఇటీవల ముఖహాజరు గుర్తింపు (ఎఫ్ఆర్ఎస్) నిబంధనలకు తీవ్రతరం చేశారు. ఆలస్యంగా విధులకు వచ్చిన వైద్యసిబ్బంది, విధులకు గైర్హాజరైన వారు, నెట్‌వర్క్ సమస్యతో ఎఫ్ఆర్ఎస్ వేయకపోయిన వారికి ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులు నోటీసులు జారీచేస్తున్నారు. 100మీటర్ల నుంచి 50 మీటర్ల ఎఫ్ఆర్ఎస్ పరిధిని తగ్గించడంతో వైద్యసిబ్బందికి కష్టాలు రెట్టింపయ్యాయి. ఇటీవల ఐఫోన్‌లో ట్యాంపరింగ్ చేసి ఎఫ్ఆర్ఎస్ వేసినట్లు కర్నూలు జిల్లాలో 7 మంది వైద్యసిబ్బందిని గుర్తించి నోటీసులు జారీచేశారు. ఇక గ్రామీణ ప్రాంతంలో సరైన నెట్‌వర్క్ లేని కారణంగా మారుమూల ప్రాంతాల్లో ఎఫ్ఆర్ఎస్‌ను ఉద్యోగులు నమోదు చేయడం లేదు. గతంలో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులకు బయోమెట్రిక్, ఎఫ్ఆర్ఎస్ మినహాయింపు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మూడుసార్లు ఆలస్యంగా వచ్చిన ఉద్యోగులకు జీతాలు నిలుపుదల చేయడంతో ఆందోళన చెందుతున్నారు. క్షేత్రస్థాయి ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలి.

శిథిలావస్థలో డీఎంహెచ్‌వో భవనం..

కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. మొదటి అంతస్తులో పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో కొన్ని గదులకు అధికారులు తాళాలు వేసి చాలీచాలని భవనాల్లో బిక్కుబిక్కుమంటున్నారు. డీఎంహెచ్‌వో ఆఫీసు నిజంగా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం కాదు. రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (ఫిమేల్)కు చెందిన నర్సుల హాస్టల్. డీఎంహెచ్‌వో ఆఫీసు మొదట మలేరియా ఆఫీసులో ఉండేది. అక్కడ భవనాలు పైకప్పు ఊడిపడుతుండటంతో ఖాళీచేసి ఆర్‌టీసీ ఫిమేల్ ట్రైనింగ్ సెంటర్‌కు చెందిన నర్సుల హాస్టల్‌లో చేరారు. ప్రస్తుతం ఇదే డీఎంహెచ్‌వో ఆఫీసుకు కొనసాగుతుంది. 1998లో ప్రస్తుతం డీఐవో ఆఫీసుపై అంతస్థులలో డీఎంహెచ్‌వో ఆఫీసు కట్టించాలని ఆదేశాలు జారీ చేసినా వాటిని ఎక్కడా అమలు చేయకపోవడంతో పాతభవనంలోనే ఆఫీసులో కొనసాగిస్తున్నారు. పక్కనున్న అనంతపురం, కడప, చిత్తూరు ప్రకాశం జిల్లాలో డీఎంహెచ్‌వో ఆఫీసులకు కొత్త భవనాలు ఉన్నాయి. కానీ ఎంతోఘన చరిత్ర రాష్ట్ర పూర్వ రాజధానిగా ఉన్న కర్నూలులో మాత్రం డీఎంహెచ్‌వో కార్యాలయానికి కొత్త భవనం లేదు.

ఎల్‌పీసీలు ఇవ్వాలి

ప్రతి పీహెచ్‌సీలో 14 మంది మాత్రమే సిబ్బంది ఉండాలన్న గత ప్రభుత్వం చేసిన జీవో.నెం.143 ప్రకారం ఎంపీహెచ్‌ఈవో, సీహెచ్‌వోల్లో ఒక్కరు మాత్రమే పీహెచ్‌సీలో ఉండాలి. గత ఏడాది 143 జీవో ప్రకారం కౌన్సిలింగ్ జరిపి రీడిప్లాయిమెంటు కింద బదిలీచేసి నేటివరకు ఎల్‌పీసీలు ఇవ్వలేదు. పనిచేసేది కర్నూలు జిల్లాలో.. మరో జిల్లాలో జీతం తీసుకుంటున్నారు. జీవో.నెం.143 ప్రకారం ఎంపీహెచ్‌ఈవో ఉన్న పీహెచ్‌సీలకే రెగ్యులర్ సీహెచ్‌వోలుగా పదోన్నతులపై పోస్టింగ్ ఇవ్వడం, వైద్యఆరోగ్యశాఖ ఆంతర్యం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ 14 ప్యాట్రాన్ ప్రకారం సిబ్బంది ఉంటే రిడిప్లాయ్ కింద ఉన్న ఎంపీహెచ్‌ఈవో ఉండాలా..? లేదా పదోన్నతి పొందిన సీహెచ్‌వో ఉండాలా వైద్య శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలి.

ఎస్వీవై ఆగ్రోతో శ్రీధర్‌రెడ్డికి సంబంధం లేదు

- సంస్థ డైరెక్టర్ సుజల వెల్లడి

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌తో సజ్జల శ్రీధర్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని సంస్థ డైరెక్టర్ సుజల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మద్యం స్కాంలో అరెస్ట్ అయిన సజ్జల శ్రీధర్‌రెడ్డిని కంపెనీ ప్రస్తుత యజమాని ప్రమోటర్, డైరక్టర్ అని ఇటీవల పలుచోట్ల ప్రచారం జరుగుతోందని, అందులో ఏమాత్రం వాస్తవం లేదని పేర్కొన్నారు. 2022 జనవరిలో శ్రీధర్‌రెడ్డికి ఎస్వీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌లో డైరక్టర్‌గా సమయం ముగిసిందన్నారు. ప్రస్తుతం కంపెనీలో ఆయన షేర్ హోల్డింగ్ మాత్రమేనని, కనీసం సంతకం చేసే అధికారం కూడా లేదన్నారు. శ్రీధర్‌రెడ్డి ఎస్వీవై ఆగ్రోలో కొనసాగుతున్నట్లు దర్యాప్తులో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు అవాస్తవమన్నారు. లిక్కర్ స్కాంలో ప్రమేయం ఉన్న రాజ్ కసిరెడ్డితో అతని వ్యక్తిగత అనుబంధమే తప్ప తమ ఫ్యాక్టరీకి ఎలాంటి సంబంధం లేదన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఓర్వకల్లు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కల్యాణ్ (32) విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సొంతింటిని నిర్మించుకుంటున్నారు. మిద్దెపై పనులు చేస్తుండగా ఇంటిపై ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కల్యాణ్ భార్య భూమిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఛాతీలో నాలుగు కేజీల కణితి తొలగింపు

- ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన వైద్యుడు



రోగితో డాక్టర్ ప్రభాకర్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఛాతిలో ఉన్న నాలుగు కేజీల కణితిని సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డా.చింతా ప్రభాకర్‌రెడ్డి ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా విజయవంతంగా నిర్వహించి ప్రాణాన్ని కాపాడారు. డోన్ మండలం జొన్నగిరికి చెందిన 40 ఏళ్ల దాసరి బేబి కొంతకాలంగా విపరీతమైన దగ్గుతో బాధపడుతున్నారు. ఓ ప్రైవేటు కాలేజీలో స్వీపర్‌గా పనిచేస్తున్న ఆమె దగ్గు మరీ ఎక్కువై ఊపిరి ఆడని పరిస్థితిలో ఈనెల 4వ తేదీన కర్నూలు జీజీహెచ్‌లోని కార్డియోథొరాసిక్ విభాగానికి వచ్చారు. సీటీ సర్జన్ డా.ప్రభాకర్ రెడ్డి పరీక్షలు నిర్వహించగా.. ఛాతీలో పెద్దగడ్డ ఉన్నట్లు గుర్తించారు. ఏకంగా ఆ గడ్డ ఎడమ వైపు ఛాతినంతా ఆక్రమించి గుండెను కుడి వైపున తోసేసింది. రక్తనాళాలు, వాయునాళాలను కూడా గట్టిగా ఒత్తేయడంతో మహిళకు సమస్యలు ఎక్కువయ్యాయి. రోగికి ఎంఆర్ఐ, సీటీ స్కాన్ చేసి గడ్డ ఎంత సైజులో ఉందో నిర్ధారించారు. చాలా ఖరీదైన ఆపరేషన్ కావడంతో ఈ నెల 22వ తేదీన ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా రోగికి థోరాకాటమి ద్వారా ఆపరేషన్ చేసి నాలుగు కేజీల కణితిని తొలగించారు. రోగి కోలుకొని శనివారం డిశ్చార్జి అయ్యారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ లక్ష మందిలో ఒకరికి ఇటువంటి సమస్య వస్తుందని, ఛాతీలో 4 కేజీల కణితి ఉండటం చాలా అరుదని తెలిపారు. ప్రతి నెల 15 మంది వరకు బైపాస్ సర్జరీ చేయించుకుని రోగులు వెళ్తుంటారని తెలిపారు.

అవయవదానంతో ఒకరికి పునర్జన్మ

- కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా
- 'జీవన్‌దాన్' రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం



అవయవదాన రిజిస్టర్‌ను ప్రారంభించిన కలెక్టర్

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అవయవదానంతో మరో వ్యక్తి పునర్జన్మ ఇవ్వవచ్చని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌లో 56 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్, కిమ్స్ ఆసుపత్రుల సీఎండీ డా.బొల్లినేని భాస్కర్‌రావు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అవయవదానం మానవతా కోణంతో చేసే గొప్పపని అని అన్నారు. కిమ్స్ హాస్పిటల్‌లో ఇప్పటివరకు 56 కిడ్నీ మార్పిడులు చేయడం గొప్ప విషయమని అభినందించారు. జీవన్‌దాన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవయవదానాన్ని అమలు చేస్తున్నాయన్నారు. కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జీవన్‌ధాన్ ద్వారా లక్ష అవయవదానాలను రిజిస్టర్ చేసుకునే ప్రక్రియను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మొదట అవయవదాన రిజిస్టర్‌ను కిమ్స్ గ్రూప్ ఆసుపత్రుల సీఎండీ డా.బొల్లినేని భాస్కర్‌రావు చేయించుకొని మాట్లాడారు. కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లో లివర్ మార్పిడిని త్వరలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ నిపుణులు డా.ఉమామహేశ్వరరావు, నెఫ్రాలజీ, యురాలజిస్టులు డా.అనంతరావు, డా.మనోజ్, డా.రఫీక్ అహ్మద్, కిమ్స్ హాస్పిటల్ సీఈవో డా.సునీల్ సేపూరి పాల్గొన్నారు.

చోరీ కేసులో ఆరుగురి అరెస్టు

- వీరిలో ఐదుగురు మైనర్లు
- 27 తులాల బంగారు, 35 తులాల వెండి ఆభరణాల స్వాధీనం



రికవరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సాయి వైభవ్‌నగర్‌లో ఆర్టీసీ డిపో మేనేజర్ ఇంట్లో జరిగిన చోరీ కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ శేషయ్య శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిందితులంతా బాలురు కావడం విశేషం. నగర శివారులోని ఓ డాబాలో పని చేసే షేక్షావలి అనే యువకుడు తనతో పాటు పని చేసే మరో ఐదుగురు మైనర్లను జత చేసుకున్నాడు. ఎలాగైనా దొంగతనం చేయాలని యుట్యూబ్ లో వీడియోలు చూసి నేర్చుకున్నారు. ఇంటి తాళాలు పగలకొట్టేందుకు మెళకువలు నేర్చుకున్నారు. నూనె, రంపం, ఇనుపరాడ్లు సిద్ధం చేసుకున్నారు. రెండు మోటారు సైకిళ్లపైన సాయివైభవ్ నగర్‌లో రెక్కీ నిర్వహించారు.

మేనేజర్ ఇంట్లో తాళం వేసి ఉండడాన్ని గుర్తించి ఆ ఇంట్లోకి వెళ్లారు. ప్రధాన ద్వారం తాళంలో నూనెపోసి శబ్దం రాకుండా ఇనుపరాడ్డుతో తాళం విరిచారు. ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో ఉన్న 27 తులాల బంగారు ఆభరణాలు, 35 తులాల వెండి ఆభరణాలు చోరీ చేశారు. ఆ తర్వాత చోరీ చేసిన సొత్తును పంచుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరీ చేసిన సొత్తును రికవరీ చేశారు. వీరిలో ఇద్దరు ఇంతకముందే రెండు దొంగతనాలకు పాల్పడినట్లు తెలిసింది. ఈ మైనర్లంతా మెకానిక్ షెడ్లలో పని చేస్తూ అల్లరి చిల్లరగా తిరుగుతూ దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

నందవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ కౌలు రైతు చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. మండలంలోని ముగతిగ్రామానికి చెందిన బోయ రంగన్న (55) ఆరెకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. గత మూడేళ్ల నుంచి దిగుబడి సరిగ్గా లేకపోవడంతో పెట్టుబడి డబ్బులు కూడా రాలేదు. మిరపకు తెగుళ్లు సోకి పంట మొత్తం నాశనం అవుతూనే వస్తోంది. అయితే సాగు కోసం సుమారు రూ.25 లక్షలు అప్పు చేశారు. అప్పు ఎలా తీర్చాలోనని మనవేదన చెందేవారు. ఈ క్రమంలో ఈనెల 24న పొలంలోనే పురుగుల మందు తాగారు. అక్కడే ఉన్న వ్యవసాయ కూలీలు గమనించి ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. రంగన్న భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రంగన్నకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. టీడీపీ నాయకుడు భార్గవ్ యాదవ్ రైతు మృతదేహానికి నివాళి అర్పించారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా



సంతజూటూరులో స్టిక్కర్ అతికిస్తున్న బొజ్జా

బండిఆత్మకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం కోసం మే 31న జరిగే ప్రజా బహిరంగ సభకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సంతజూటూరు గ్రామంలో శనివారం సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం కోసం పాదయాత్ర జరిగి 9వ వార్షికోత్సవం సందర్భంగా మే31 బహిరంగ సభ ను విజయవంత చేయాలని ఇంటింటికి స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని నిర్వహించారు. బొజ్జా మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టును పూర్తిగా రాయలసీమ తాగు, సాగు నీటి అవసరాలకే కేటాయించాలని, కేఆర్ బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరారు. రాయలసీమలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నీ మూడు సంవత్సరాల్లోగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. సిద్ధేశ్వరం అలుగు రాయలసీమ రైతాంగానికి గుండెలాంటిదని, ప్రభుత్వం దీన్ని నిర్మించి కరువుసీమను సశ్యశ్యామలం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వైఎస్‌రెడ్డి, ముమ్మడి కృష్ణారెడ్డి, రాముడు, భాస్కర్‌రెడ్డి, శ్రీహరి, మాబాషా, సుధాకరరావు పాల్గొన్నారు.



వరుణ్ రియల్ ఎస్టేట్
కర్నూలులో ఇండ్లు, ఫ్లాట్స్ కొనబడును, అమ్మబడును & బ్యాంక్స్ ద్వారా హౌసింగ్ & పర్సనల్ లోన్స్ ఇప్పించబడును. సంప్ర : పి.గోవింద్ సింగ్ రాజ్‌పుత్ : 99630 04641
AJL-229677

COMPUTER EDUCATION
NICE COMPUTER SUMMER COURSES: M.S.Office, DTP, TALLY, C++, Phython, Photoshop, DCA, PGDCA etc. Cont: 1st Lane, V.R.Colony, KNL. 9396861308
AJL-236505

WANTED
ప్రముఖ ఫైనాన్స్ నందు వర్క్ చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. సంప్ర : జి.వి.అసోసియేట్, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, స్కందా బిజినెస్ పర్క్ షాప్ నెం.29, 4వ ఫ్లోర్, కర్నూలు. సెల్ : 82979 91969
AJL-229226

DENTAL
రేడియంట్ డెంటల్ క్లీనిక్: అన్ని రకాల దంత సమస్యలకు అత్యుత్తమ వైద్య చికిత్స. EHS ద్వార ప్రభుత్వ ఉద్యోగులకు, క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ కలదు. సంప్రదించండి ఎన్. ఆర్.పేట: 73869 44217. గాయత్రి ఎస్టేట్స్ : 86886 61622. చెన్నమ్మ సర్కిల్ : 85002 26655, కర్నూలు.
AJL-229680

HOUSE FOR SALE
House No: 10/123A, Krishna Nagar, Kurnool. 518002. Contact: P.Sankar, Cell Number: 94403 74905.
AJL-229245

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును. (రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237514

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ ప్రతిరోజు
చిన్న ప్రకటన పెద్ద స్పందన
Contact: 99854 11369

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



ఆంధ్రజ్యోతి
ప్రకటనల కోసం సంప్రదించండి.
మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు తక్కువ ఖర్చుతో ఆంధ్రజ్యోతిలో ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలియజేయండి.
99854 02121

పర్యావరణ హిత ప్రగతి

- కర్నూలు నగరంలో కాలుష్య నియంత్రణ, సుందరీకరణకు చర్యలు
- రూ.7.87 కోట్ల ఎన్‌క్యాప్ నిధులతో అభివృద్ధి



నగరంలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో కాలుష్య నియంత్రణ, పర్యావరణహిత కార్యక్రమాలకు పెద్దపీట వేయనున్నారు. ఈమేరకు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, నగరపాలక సంస్థ ఉమ్మడి సహకారంతో ప్రగతి ప్రణాళికను రూపొందించారు. ఇందుకు అవసరమైన ఆర్థిక తోడ్పాటును కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ అందించనుంది. ఈ క్రమంలో ఎన్‌క్యాప్(నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగాం) కింద రూ. 7.87కోట్ల నిధులను కేటాయించింది. వీటి ద్వారా నగరాన్ని సుందరీకరించటంతో పాటు, కాలుష్యాన్ని నియంత్రించే దిశగా పనులను ప్రతిపాదించి, ఆమోదం పొందారు.


రహదారుల విస్తరణ, పచ్చదనం పెంపు

ఎన్‌క్యాప్ కింద రూ.7.87 కోట్ల నిధులు మంజూరు కాగా, వీటి ద్వారా ప్రధానంగా రహదారుల విస్తరణ, కూడళ్ల వృద్ధి, కాలిబాటల ఏర్పాటు, పచ్చదనం పెంపునకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. దాదాపు 18 పనులను రూపొందించి వాటిని కలెక్టర్ వద్ద ఆమోదం పొందారు. ఇందులో రూ.5.49 కోట్లతో రహదారి పనులను నిర్వహించాలని, రూ.2.20 కోట్లతో పార్కులు, రోడ్ల డివైడర్ల మధ్య పచ్చదనం పెంపుతో పాటు మొక్కలు నాటాలని నిర్ణయించారు. మరో రూ.15లక్షలతో రాజ్ విహార్ కూడలి, కలెక్టరేట్, నగరపాలక సంస్థ వద్ద గాలి నాణ్యతను సూచించే సూచికలను ఏర్పాటు చేయాలని, రూ.3లక్షలు ప్రజాచైతన్య కార్యక్రమాల కోసం ప్రతిపాదించారు. కిడ్స్ వరల్డ్ నుంచి రాజ్‌విహార్ కూడలి, విశ్వేశ్వరయ్య కూడలి నుంచి సి.క్యాంపు, సి.క్యాంపు నుంచి బి.క్యాంపు ఆటోస్టాండు, సుంకేసుల రహదారిలోని సెయింట్ జోసఫ్ పాఠశాల నుంచి లేక్ రిడ్జ్ అపార్టుమెంట్ వరకు రహదారి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. చెన్నమ్మ కూడలి నుంచి ఏపీఐఐసీ కార్యాలయం వరకు సీసీ రోడ్డు నిర్మించనున్నారు. ఐదు రహదారుల కూడలి నుంచి బంగారుపేట, మదర్ థెరిసా విగ్రహం నుంచి ఘంటసాల విగ్రహం, ఉల్చాల వై జంక్షన్ వద్ద డివైడర్ల అభివృద్ధి, మొక్కలు నాటేందుకు ప్రతిపాదించారు. ఇక కిసాన్‌నగర్, మారుతీనగర్ పార్కుల్లో పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకోనున్నారు.

అభివృద్ధికి ఊతం

నగరం కాలుష్య కారకంగా మారటంతో దిద్దుబాటు చర్యలకు సంబంధిత శాఖలు నడుం బిగించాయి. ఏటా కాలుష్య నియంత్రణ మండలి పరిధిలో ఎన్‌క్యాప్ కింద నిధులు మంజూరు అవుతుండగా, ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయిచటం ఇదే మొదటి సారి. గతంలో ఈ నిధుల ద్వారా వాహనాల కొనుగోలు, వ్యర్థాలతో ఇటుకల తయారీ వంటి పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. అయితే ఈ సారి పూర్తిగా పర్యావరణానికి మేలు జరిగే పనులకే వెచ్చించనున్నారు. ముఖ్యంగా అధ్వానమైన రహదారుల వల్లే అధికశాతం దుమ్ముధూళి వస్తోందని నిపుణుల అధ్యయనంలో తేలింది. దీంతో తొలుత వాటిని బాగు చేయాలనే లక్ష్యంతో రహదారుల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అదేవిధంగా కాలుష్య నియంత్రణలో పచ్చదనం పెంపు ప్రాధాన్యాన్ని గుర్తించి ఈ పనులకు నిధులను ఖర్చు చేయనున్నారు.

సమష్టి సహకారంతో కాలుష్య నియంత్రణ



నగరంలో ఏ ప్రాంతంలో, ఏ రూపంలో కాలుష్యం వెలువడుతుందో గుర్తించి, ఆ దిశగా నియంత్రణ చర్యలు చేపట్టనున్నాం. ఇందులో భాగంగా అభివృద్ధి భాగస్వామ్యంతో కాలుష్యాన్ని నియంత్రించాలని ప్రణాళికలు రూపొందించాం. ఈ క్రమంలో నగరపాలక అధికారులు ఆవశ్యకత ఉన్న ప్రాంతాల్లో రహదారి విస్తరణ, పచ్చదనం పనులు చేపడుతున్నారు. దీనికి అవసరమైన ఆర్థిక సహకారం ఎన్‌క్యాప్ పథకం కింద సీపీసీబీ అందిస్తోంది. కర్నూలును కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడానికి కలెక్టర్ రంజిత్ బాషా ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. అందరి సహకారంతో కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతాం.

- పీవీ కిషోర్‌రెడ్డి, పర్యావరణ ఇంజనీర్, కాలుష్య నియంత్రణ మండలి,

జేఎఫ్‌సీఎం కోర్టు మంజూరు చేయించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

నందికొట్కూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలో జుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టును మంజూరు చేయించాలని నందికొట్కూరు బార్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు వినతిపత్రం సమర్పించారు. శనివారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యేను వారు కలిశారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు జాకీర్ హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శరబయ్య, నాయవాదులు భాస్కర్, చెరుకు వెంకటేశ్వర్లు బలపాలకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి: రాజు

పాములపాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సచివాలయాలని మండల ప్రత్యేకాధికారి రాజు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శనివారం మిట్టకందాల, పాములపాడు గ్రామాల్లో సచివాలయాలలో రికార్డులు తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయాపాలన పాటించాలని అన్నారు. ఫిర్యాదులను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన సర్వేల పట్ల నిర్లక్ష్యం వీడి, సర్వేలను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్



ప్రజలతో మాట్లాడుతున్న పోలీస్ అధికారి

నంద్యాల క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ జావళి ఆల్ఫోన్స్ సూచనలతో శనివారం నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆత్మకూరు బస్టాండ్, చెరువుకట్ట ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు. అనుమానితుల ఇళ్లు, అనుమానిత వ్యక్తులు, రౌడీషీటర్లు, నేరచరిత్రగల వారి ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం అనుమానితులు, నేరచరిత్రగల వారు, రౌడీషీటర్లు ఏదైనా నేరాల్లో పాల్గొంటున్నారనే అనుమానంతో వారి వేలిముద్రలను మొబైల్ సిస్టం చెక్ డివైస్ ద్వారా పరిశీలించినట్లు వెల్లడించారు. కార్డెన్‌సెర్చ్‌లో వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి, టూటౌన్ సీఐ ఇస్మాయిల్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డి వామి దగ్ధం

బండిఆత్మకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.కోడూరు గ్రామానికి చెందిన చాకలి వీరభద్రుడు గడ్డివామి దగ్ధమైంది. గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వెనుక ఉన్న గడ్డి వామిలో ఉన్నట్లుండి మంటలు చెలరేగాయి. ఈ ఘటన ప్రమాదవశాత్తు సంభవించిందా లేక ఎవరైనా నిప్పుపెట్టి ఉంటారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రమాదంతో బాధితుడికి రూ.70వేల మేర నష్టం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు.

'శ్రీనివాసరావుపై అనుచిత వాఖ్యలు సరికాదు'

ఆత్మకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పాలకోడేరు గ్రామంలో పేదల ఇళ్లను రఘురామకృష్ణంరాజు కూల్చివేశారన్నారు. ప్రజల పక్షాన న్యాయపోరాటం చేస్తున్న శ్రీనివాసరావుపై డిప్యూటీ స్పీకర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.

● ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలపై మే డే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులు, చట్టాలపై దాడి చేస్తున్న కార్పొరేట్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులురణధీర్, స్వాములు, మల్లయ్య, పుల్లయ్య, కలిముల్లా, రాంబాబు, శ్రీను, వీరన్న, నూర్‌అహ్మద్ తదితరులు ఉన్నారు.

పెంచిన పన్నుల భారాన్ని తగ్గించాలి



కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో పెంచిన ఆస్తి పన్నుల భారాన్ని తగ్గించాలని, ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం నా యకులు రణధీర్ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, కమిషనర్ రమేష్‌బాబులకు వినతిపత్రాలను అందజేశారు. పెంచిన పన్నులను వెంటనే తగ్గించాలని, లేనిపక్షంలో ప్రజాపోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు వీరన్న, శివుడు, గణపతి, రమణ ఉన్నారు.

సుందరమ్మ భూములు వేలం

నంద్యాల రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ స్వాధీనంలో ఉన్న సుందరమ్మ భూములకు కౌలువేలం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించారు. నంద్యాల పట్టణంలో ఉన్న సర్వే నెం 1544-1కు సంబంధించిన 5.02 ఎకరాల భూమిని దేవేంద్రగౌడ్ ఎకరాకు రూ 43 వేల చొప్పున వేలం పాడి కైవసం చేసుకున్నాడు. అలాగే మూలసాగరం పరిధిలోని సర్వే నెం 112-ఎ, నందు 7.14 ఎకరాలు, 159 నందు 16.58 ఎకరాలకు గాను మల్లేస్ ఎకరాకు రూ 36 వేల చొప్పున వేలం పాడి కైవసం చేసుకున్నాడు. వేలం దక్కించుకున్న వారు 2028 వరకు మూడు సంవత్సరాల పాటు భూములు సాగు చేసుకోవచ్చునని ఎంపీడీవో తెలిపారు. వేలంలో మండల అధ్యక్షులు శెట్టి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లిం మహిళ వివాహానికి సాయం

నంద్యాల రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని 38 వవార్డు నందమూరినగర్ టీడీపీ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు పేద ముస్లిం మహిళ వివాహానికి శనివారం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. స్థానికంగా నివసిస్తున్న షేక్‌మాబాషా, షేక్ సల్మాల కుమార్తె వివాహానికి ఆయన ఈసహాయం చేశారు. వార్డులో జరిగే వివాహాలతో పాటు మరణించిన కుటుంబాలకు కూడా రెండుసంవత్సరాలుగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.

పకడ్బందీగా అమలు చేయండి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ, ఎన్టీఆర్ వైద్యసేవ కార్యక్రమాల అములుపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. లింగనిర్ధారణ వెల్లడి నిషేధంపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలని చట్టంలోని నిబంధనల మేరకు స్కాన్, డయాగ్నోస్టిక్ సెంటర్లు లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. లింగనిర్ధారణ కోసం ప్రయత్నించినా, ప్రోత్సహించినవారిపై చర్యలు తప్పవన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈచట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద ప్రజలకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యసేవలు అందించకుండా నగదు వసూలు చేసినట్లు 8 ఆస్పత్రుల్లో 33ఫిర్యాదులు నమోదయ్యాయని వారికి నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. చట్టవ్యతిరేకంగా పరీక్షలు చేసిన వైద్యులకు మొదటిసారి తప్పుకు రూ.10వేలు జరిమానా, 3సంవత్సరాల జైలు శిక్ష, రెండవసారి తప్పుచేస్తే రూ.50వేలు జరిమానా, 5సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందన్నారు. మూడోసారి అదే తప్పు చేస్తే వైద్యుల పేర్లు కౌన్సిల్ నుంచి తొలగించనున్నట్లు చెప్పారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డా.వెంకటరమణ, ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ డా.ఓ.లలిత, ఎన్టీఆర్ వైద్యసేవ కో ఆర్డినేటర్ డా.రూపేంద్రనాథ్‌రెడ్డి, ఇన్‌చార్జి డెమో రవీంద్రనాయక్, సీఐలు సూర్యమౌళి, ఇస్మాయిల్, జిల్లా మానిటరింగ్ అధికారి సుమలత తదితరులు పాల్గొన్నారు.

నాలుగు తీర్మానాలకు ఆమోదం

ఆత్మకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో శనివారం చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు నాలుగు తీర్మానాలను ఆమోదించారు. ఇందులో ప్రధానంగా 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి రూ.74.39లక్షలతో సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు సంబంధించి ఐదు వర్క్‌లకు ఆమోదం తెలిపారు. అదేవిధంగా వడ్లరామాపురం రస్తాలోని ఏబీఎం పాలెం వద్ద గల నిరూపయోగంగా ఉన్న సామూహిక మరుగుదొడ్డి కూల్చేయాలని నిర్ణయించారు. అలాగే రూ.1.98లక్షలతో గుండ్లకమ్మవాగులో పూడిక తీత పనులను చేపట్టేందుకు గాను రెండు తీర్మానాలను అంగీకరించారు. ఇదిలావుంటే రోడ్లు, డ్రైన్లు, నీటిసరఫరా, ఎలక్ట్రికల్ వర్క్‌లకు సంబంధించి క్వాలిటీ అస్యూరెన్స్ సర్టిఫికెట్లను ఇచ్చేందుకు గాను ప్రైవేట్ కన్సల్టెన్సీ ఏర్పాటుకు సంబంధించిన తీర్మానాన్ని వాయిదా వేశారు. అలాగే 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి షేక్ షబ్బీర్ అమ్మద్ అనే పాటాదారుడు బస్టాండ్ వేలాలను రూ.15,01,000 దక్కించుకుని రూ.6లక్షల డిపాజిట్ చెల్లించారు. అయితే హైకోర్టు ఉత్తర్వులతో బస్టాండ్ ఫీజుల వసూళ్లు నిలిపివేయడం వల్ల తనకు నష్టం వాటిల్లిందని తాను చెల్లించిన డిపాజిట్లను తిరిగి చెల్లించాలని పాటాదారుడి విజ్ఞప్తితో పాటు గేట్ల పాటాను రద్దు చేయాలని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లగా ఇలాంటి తీర్మానాలను టేబుల్ అజెండాను తీసుకురావడం సబబని కాదని కౌన్సిల్ సభ్యులు వాయిదా వేశారు. కాగా తమ వార్డుల్లో జరిగే అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనపై తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని సభ్యులు ప్రశ్నించగా ఇక నుంచి ఎలాంటి సమన్వయ లోపం లేకుండా చొరవ తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు వారికి సర్దిచెప్పారు.

30న సున్నిపెంటలో జాబ్‌మేళా

సున్నిపెంట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ వారు ఈనెల 30తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలం, సున్నిపెంట, దోమలపెంట, ఈగలపెంట గ్రామాల్లోని నిరుద్యోగులు, విద్యార్థులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ రిజనల్ మేనేజర్ షేక్‌జిలాని, మేనేజర్లు కే.రాముడు,నవీన్‌కుమార్ పాల్గొన్నారు. సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీకాలేజి పిన్సిపాల్ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు.

ముగిసిన పాలిసెట్ ఉచిత శిక్షణ

సున్నిపెంట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సున్నిపెంటలోని ప్రభుత్వ ఆదర్శ గురుకుల పాల్‌టెక్నిక్ కాలేజీలో 2వ తేదీ నుంచి ప్రారంభమైన పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు శనివారంతో ముగిసినట్లు ప్రిన్సిపాల్ రంగయ్య తెలిపారు. కోచింగ్ చివరిరోజు గ్రాండ్ టెస్ట్ నిర్వహించి ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి, విద్యార్థులకు కోచింగ్ ఇచ్చిన అధ్యాపకులను అభినందించారు. బుధవారం జరిగే ప్రధాన పరీక్షలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్ విద్యార్థులను కోరారు.

చెంచుకులకు సర్టిఫికెట్ల పంపిణీ

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థలో తేనెటీగల పెంపకంపై శిక్షణ పొందిన చెంచులకు అధికారులు సర్టిఫికెట్లను అందజేశారు. ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జాన్సన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వెంకటశివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ చెంచుల జీవనోపాధిని పెంచేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా చెంచులకు ఏడురోజుల పాటు తేనెటీగల పెంపకంపై శిక్షణను ఇవ్వడం జరిగిందన్నా రు. త్వరలో వారికి తేనెటీగలను పెంచే పెట్టెలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వెలుగు సీసీ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడులు హేయం



నంద్యాలలో నివాళి అర్పిస్తున్న నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అమాయకులపై ఉగ్రవాదులు దాడులు చేయడం అత్యంత హేయమైన చర్య అంటూ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు మృతులకు నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షులు ప్రసాద్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా కొవ్వొత్తులతో నివాళులర్పిస్తూ దాడిని ఖండించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణుడు, అరవింద్, ఖా సిం, రామనాయక్, వెంకటరమణ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నందికొట్కూరు: కశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని హిందువులు డిమాండ్ చేశారు. శనివారం మిడుతూరులో దాడికి నిరసనగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాజారెడ్డి, రాంమోహన్, చిట్టిబాబు, నాగేష్, ఈశ్వర రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం: ఆర్డీవో

ఆత్మకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ కేవీకే స్టేడియంలో ఆత్మకూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా అధికారి రాజు, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, డాక్టర్ మన్సూర్, స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్సీల్ మున్నా, నాయకులు ఉన్నారు.

'నిబంధనలు సడలించాలి'



మాట్లాడుతున్న ఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు డిగ్రీ అర్హత మార్కుల తదితర నిబంధనలు సడలించాలని షెడ్యూల్డ్ ట్రైబ్స్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు కోరారు. నంద్యాలలో నిర్వహించిన సమావేశంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గోర్లసుధాకర్, కాళింగిరి కుమార మాట్లాడుతూ ఎస్ఏ పోస్టులకు ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు డిగ్రీలో 45శాతం, జనరల్ అభ్యర్థులకు 50శాతం మార్కులు ఉండాలనే నిబంధన సరికాదన్నారు. ఎస్సీ ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు 40శాతానికి తగ్గించి డీఎస్సీ రాసేందుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్‌చేశారు.

'గురురాజా' విద్యార్థికి డీఈవో అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలో 597 మార్కులు సాధించిన నంద్యాల గురురాజా పాఠశాల విద్యార్థి నర్సిరెడ్డిని డీఈవో జనార్దన్‌రెడ్డి అభినందించారు. ఆయన మాట్లాడుతూ పదిలో సాధించిన మార్కులను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత చదువుల్లో మరింతగా రాణించాలని అన్నారు. పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి మాట్లాడుతూ నర్సిరెడ్డితో పాటు తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 590 మార్కులకు పైగా ఆరుమంది, 580 మార్కులకు పైగా 33 మంది, 550 మార్కులకు పైగా 109 మంది, 500 మార్కులకు పైగా 256 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని డీఈవోకు తెలిపారు.

ఆత్మకూరులో పోలీసుల ముమ్మర సోదాలు



ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో చోటు చేసుకున్న ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో పాకిస్థాన్ పౌరులందరు 48గంటల్లోగా భారత్‌ను వదిలి తమ దేశానికి వెళ్లిపోవాలని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ పౌరులు ఇంకా ఎవరైనా భారత్‌లో ఉన్నారేమో అన్న నిఘా వర్గాల సూచనలతో శనివారం ఆత్మకూరులో పోలీసులు ముమ్మరంగా సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ రాము ఆర్టీసీ బస్టాండ్‌లోని పలువురు ప్రయాణికులను విచారించారు. అదేవిధంగా పట్టణంలోని అన్ని లాడ్జీలను తనిఖీ చేసి అనుమానిత వ్యక్తుల గురించి ఆరా తీశారు. అలాగే లాడ్జిల్లోని రిసెప్షన్ కౌంటర్ల రికార్డులను పరిశీలించి, ఎవరైనా అనుమతులు ఉన్నట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని లాడ్జి నిర్వాహకులకు సూచించారు.

ఆలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు ప్రతిపాదనలు

నంద్యాల మున్సిపాలిటీ ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు రూ.36 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు కేసీ ఈఈ ప్రతాప్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 7 కిలోమీటర్ల పొడవైన అలగూరు రిజర్వాయర్ గాలేరు చెరువు మీద నిర్మితమైన 500 మీటర్ల ప్రాంతమే కుంగిపోయిందన్నారు. ఈనేపథ్యంలోనే రిజర్వాయర్‌లో నీటిని నిలువ చేయలేదని స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బండ్ మరమ్మతు, తదితర పనులకు 36.32 కోట్ల ప్రతిపాదనలు పంపామని, బండ్ నిర్మాణం పూర్తైతే కడప జిల్లాలలో 92,000 వేల ఎకరాలకు సాగునీరు, అలాగే తాగు నీరు అందుతుందని తెలిపారు.

ఆహార భద్రత నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకటరాముడు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రిటైల్ వ్యాపారులు ప్రతి ఒక్కరూ ఆహార భద్రతా నియమాలు పాటించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకటరాముడు, కాశింవలి పేర్కొన్నారు. శనివారం నంద్యాల రిటైల్ వాపారస్తుల సంఘం కార్యాలయంలో రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లిఖార్జున అధ్యక్షతన నిర్వహించిన రిటైల్ వ్యాపారస్తులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్ డాక్టర్ రాజకుమార్ మాట్లాడుతూ వ్యాపారస్తులు హోటళ్లు, కిరాణాషాపులు, కూల్ డ్రింక్స్, స్వీట్‌షాపులు, బేకరీలు, ఐస్‌క్రీమ్ పార్లర్లు, నూనెదుకాణాలు, మాం సం విక్రయదారులు, రెస్టారెంట్స్, వీధివ్యాపారులు, పాలవ్యాపారస్తులు, ప్రతి వ్యాపారస్తుడు పాస్టాక్ శిక్షణ పొంది ఫుడ్‌సేఫ్టీ సూపర్‌వైజర్ ట్రైనిం గ్ సర్టిఫికెట్ కలిగి వుండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు, కేవీజీఎం సౌత్ ఇండియా ఇన్‌చార్జిలు సింధు, మోహన్‌బాబు, పాస్టాగ్ జిల్లా ఎగ్జిక్యూటివ్స్ సాయిరాం, రాములు, ఖాజహుస్సేన్, మాధ వి, కిరాణ షాపుల యజమానులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

బండిఆత్మకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):మండలంలోని కడమలకాల్వ గ్రామంలో ఓ భూవివాదంలో అధికారుల ఎదుట ఇరువర్గాలు ఘర్షణ పడ్డారని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. శనివారం స్థానిక రైతు సేవా కేంద్రంలో గ్రామంలో రీసర్వే చేస్తున్న సర్వేయర్లు రికార్డుల పరిశీలన సమయంలో భూమి విషయంలో గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భాస్కర్, సుబ్బరాయుడు మధ్య మాట మాట పెరిగి గొడవకు దిగారు. ఘర్షణలో భాస్కర్‌కు స్వల్ప రక్త గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బండిఆత్మకూరు పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరుపక్షాలను చెదరగొట్టి ఇరువురిని స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

62 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



జాబ్‌మేళాలో పాల్గొన్న వివిధ కంపెనీల ప్రతినిధులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రామకృష్ణా డిగ్రీ కళాశాలలో వివిధ కంపెనీలు నిర్వహించిన జాబ్‌మేళాలో 62 మంది విద్యార్థులకు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరక్టర్ హేమంత్‌రెడ్డి తెలిపారు. కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్, చెన్నై, బెంగళూరు కేంద్రంగా 10 కంపెనీల ప్రతినిధులు 130 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 62 మంది ఎంపికైనట్లు వివరించారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ప్రిన్సిపాల్ కేబీవీ సుబ్బయ్య, ఇంతియాజ్‌అహ్మద్‌లు పాల్గొన్నారు.

మహానందిలో దర్శకుడు దర్శకుడు శ్రీకాంత్



దర్శకుడితో వేదపడింతులు

మహానంది, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ప్రముఖ దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల శనివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాధారణ భక్తుడి లాగా ఆలయానికి వచ్చిన దర్శకుడు ప్రధాన ఆలయాల్లో స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నాడు. కల్యాణ మంటపంలో శ్రీకాంత్ అడ్డాలను ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, అర్చకులు మామిళ్ళపల్లి రాఘవశర్మల ఆధ్వర్యంలో శాల్వాతో సన్మానించి, ప్రసాదాలు అందచేశారు. ప్రస్తుతం కొత్త చిత్రాలు కమిట్ కాలేదని అన్నారు. కథలు తయారు చేసే పనిలో ఉన్నట్లు తెలిపారు.

ఉద్యోగికి ఎంపికైన ఎస్‌వీఆర్ కళాశాల విద్యార్థిని



ఉద్యోగానికి ఎంపికైన విద్యార్థినితో కళాశాల యాజమాన్యం

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంస్థ ఆరడైన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగానికి ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ఐశ్వర్య ఎంపికై నట్లు కళాశాల చైర్మన్ వెంకట్రామిరెడ్డి, ఎండీ దినేష్‌రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ బ్రాంచ్‌లో చదువుతున్న ఐశ్వర్య రూ.19.4 లక్షల వార్షిక ప్యాకేజ్‌తో ఉద్యోగానికి ఎంపిక కావడం గొప్ప విజయం అన్నారు. మరింత మంది విద్యార్థులు ఇలాంటి అవకాశాలు పొందాలని ఆకాంక్షిం చారు.

మురుగును తొలగించరా?



ఇళ్ల మధ్యన నిల్వ ఉన్న మురుగు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారుమంచాల గ్రామంలో దళితకాలనీ కంపుకొడుతోంది. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు నీరంతా ఇళ్ల మధ్యనే నిల్వ ఉంటోంది. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని గతంలో అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటిని తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కొలను భారతి క్షేత్రానికి రూ.3.47 లక్షల ఆదాయం



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

కొత్తపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొలనుభారతికి రూ.3.47 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో రామలింగారెడ్డి తెలిపారు. శనివారం నంద్యాల దేవాదాయ శాఖ తనిఖీ అధికారి హరిశ్చంద్రారెడ్డి అధ్యక్షతన ఈవో రామలింగారెడ్డి, చైర్మన్ వెంకటనాయుడు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు, పూజాసామగ్రి, అక్షరాభ్యాసం, భక్తులు సమర్పించిన మిశ్రమ బియ్యానికి వేలం పాట నిర్వహించారు. ముందుగా క్షేత్ర ప్రాంగణంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో క్షేత్రానికి రూ.2,06,821, టెంకాయలు విక్రయించేందుకు వేలం పాట నిర్వహించగా రూ.69వేలు, అమ్మవారికి భక్తులు సమర్పించిన మిశ్రమ బియ్యాన్ని పోగు చేసుకునేందుకు రూ.1,60,000 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. పరదేశినాయుడు అనే వ్యక్తి వేలం పాటను దక్కించుకున్నట్లు ఈవో పేర్కొన్నారు. పూజా సామగ్రి, అక్షరాభ్యాస కిట్లను వి క్రయించేందుకు రూ.1,18,000ను ఎల్లనాయుడు అనే వ్యక్తి వేలం దక్కించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఎర్రం శ్రీను, రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది నంద్యాల బాలాజీ సేవా ట్రస్టు శివమ్మ బృందం పాల్గొన్నట్లు తెలిపారు.

వంతెన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?



నిలిచిపోయిన వంతెన పనులు

పగిడ్యాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుమర్రి, పగిడ్యాల గ్రామాల్లోని కేసీ కాలువపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణాలు పూర్తికావడం లేదు. పగిడ్యాల గ్రామంలో కేసీ కాలువపై నూతన వంతెన నిర్మాణం కోసం రూ.1.60 లక్షలు, ముచ్చుమర్రి గ్రామానికి రూ. 1.20 లక్షలు మంజూరు చేశారు. నిదులు మంజూరు కావడంతో అధికారులు నిర్మాణం పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించిన తర్వాత కేసీ కాలువకు నీటిని విడుదల చేయడంతో పనులు ఎడాదిగా నిలిచిపోయాయి. వంతెనపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయం పై కేసీ కెనాల్ ఏఈ నరేష్‌ను వివరణ అడుగగా పగిడ్యాల, ముచ్చుమర్రి గ్రామాలల్లో కేసీ కాలువలపై నూతన వంతెనలను నిర్మించేందుకు గత ఎడాది పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం కాలువలో నీరు లేకపోవడంతో పదిరోజులో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

వడదెబ్బతో చనిపోతే పరిహారం

● నంద్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

డోన్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో మరణిస్తే ప్రభుత్వం రూ. నాలుగు లక్షల పరిహారాన్ని ప్రకటించిందని నంద్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. శనివారం పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటరులో హెల్త్ ఇన్‌ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రోగ్రాంకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడారు. వడదెబ్బ తగిలి మరణిస్తే ఆబాధిత కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చే పరిహారంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విస్తృత ప్రచారం చేయాలన్నారు. డీఐవో సుదర్శన్, డీపీఎంవో అంకిరెడ్డి, ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి కాంతారావు, నా యక్, స్టాటిస్టికల్ ఆఫీసర్లు మస్తానయ్య, సుజాత మెడదికల్ ఆఫీసర్లు రాంభూపాల్, చెన్నకేశవులు, శాబాజ్, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, చెన్నయ్య, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

● మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండులో రూ.6 కోట్లతో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ పనులు త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. శనివారం చైర్మన్‌తో పాటు మున్సిపల్ డీఈ రఘు, ఏఈ సురేష్, టౌన్ ప్లానింగ్ అధికారి శబరీష్‌తో కలిసి కూర గాయల మార్కెట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఇప్పటికే రూ.4.50 కోట్లు కాంట్రాక్టరుకు మున్సిపాలిటీ చెల్లించిందని పేర్కొన్నారు. వీలైనంత తొందరలో పనులు పూర్తిచేసి మున్సిపాలిటీకి అందించాలని కాంట్రాక్టరుకు సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బనగాన పల్లె, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన చిన్నసుబ్బరాయుడు(68) అనారోగ్యంతో మృతిచెందాడు. పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి శనివారం ఆర్థికసాయం అందించారు. పేదవారికి అండగా నిలిచి తన ఉదారతను, మానవత్వాన్ని మరోసారి బీసీ రాజారెడ్డి చాటుకున్నారు.

మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరి : ఏవో

దొర్నిపాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రైతులు పొలాల్లో మట్టిన మూనా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారిణి ప్రమీల అన్నారు. శనివారం కొత్తపల్లెలో సబ్సిడీపై రైతు లకు అందజేసిన రోటావేటర్, వ్యవసాయ యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వచ్చే ఖరీఫ్‌కి మట్టి నమూనా పరీక్షలు చేయించుకొని వాటి ఆధారంగా ఎరువులు వాడాలని సూచించారు. ఇప్పటివరకు 690 మట్టినమూనా పరీక్షలు చేసినట్లు తెలిపారు.

'పీఎం సూర్యఘర్'కు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

రుద్రవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ పథకానికి అందరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని విద్యుత్ శాఖ డిప్యూటీ డీఈ రవికాంత్ చౌదరి అన్నారు. శనివారం రుద్రవరం సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే బ్యాంకు రుణాలు విద్యుత్‌శాఖనే ఇప్పిస్తుందన్నారు. విద్యుత్ బకాయిలను కూడా త్వరితగతిన చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ సునీల్‌కుమార్, సబ్ ఇంజనీరు రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

● ఎంపీడీవో సాల్మన్

సంజామల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సాల్మన్ పంచాయతీ అధికారులను సూచించారు. శనివారం ఎంపీపీ పోచా రమాదేవి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవ సాయ శాఖపై వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి వేసవి దుక్కులు, భూసార పరీక్షల గురించి సభకు తెలిపారు. తహసీల్దార్ అనిల్‌కుమార్ రెవెన్యూ శాఖలో తీసుకుం టున్న నిర్ణయాలు రీసర్వేను సభకు వివరించారు. హౌసింగ్ ఏఈ బాల చంద్రుడు ఎన్.టి.ఆర్ గృహాలకు సంబంధించి సభకు తెలియజేశారు. ఎన్ఆర్ఈజీఎస్‌పై ఏపీవో జయంతి మాట్లాడారు. వేసవిలో పనులు వేగంగా జరగడం లేదన్నారు. మిరప కోతలు ముమ్మరంగా ఉండటంతో ఉపాధి పనులకు కూలీలు రావడం లేదని ఆయా గ్రామాల నాయకులు ఉపాధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. రామిరెడ్డిపల్లెకు విద్యార్థి బస్సు నడపాలని ఆ గ్రామ సర్పంచ్ మంచాల వీరప్రతాప్ రెడ్డి కోరారు. ఉత్తమ పంచాయతీ కార్యదర్శులుగా ఎన్నికైన లక్ష్మయ్య, వెంకటనా రాయణ, భారతి, ఎంపీడీవో ఆఫీసు అటెండర్ దస్తగిరిని సత్కరించి సన్మానించారు. సమావేశంలో అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం త్రయోదశి పురస్కరించుకొని గ్రామానికి చెందిన భక్తుల విజ్ఞప్తి మేరకు ఆలయ ప్రధాన అర్చకులు అక్షిత స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన ఆకు పూజ, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

● తప్పిన పెను ప్రమాదం

రుద్రవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న కంబలూరు గ్రామ సమీపంలో మలుపు వద్ద శనివారం విద్యుత్ స్తంభాన్ని ఓ కారు ఢీకొట్టింది. ఈ కారులో దక్షిణకొట్టాలు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. వారు మద్దిలేటిస్వామికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. తృటిలో పెను ప్రమాదం తప్పి నలుగురు క్షేమంగా ప్రాణాలతో బయటపడ్డారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు

బనగానపల్లె, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో ఈనెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు గ్రంథాలయాధికారి బషీర్ అహమ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఎండలో తిరగనివ్వకుండా గ్రంథాలయానికి పంపాలని ఆయన కోరారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే చదివించడం కథల ద్వారా నీతి బోధనలు, డ్రాయింగ్ , చదరంగం, ఆటలు, జనరల్ నాలెడ్జ్ వంటి వారితో శిక్షణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

బేతంచెర్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల పట్టణంలో కర్నూలు, నంద్యాల క్రాస్ రోడ్డులో ఉన్న శేషారెడ్డి సర్కిల్ వద్ద బేతంచర్ల సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ తిరుపాలు పోలీసు సిబ్బంది శనివారం సాయంత్రం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో వాహనాలు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని లాడ్జీలు, బస్టాండు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు.

GENERAL NOTICE

అందరికీ తెలియజేయడం ఏమనగా మా కక్షిదారుడు Shriram Finance Ltd, Dhone Branch వారు ఈ క్రింద కనబరచిన షెడ్యూలు Property ని Mortgage చేసుకొని **Mangali Lalithamma, W/o. Mangali Kaulutlaiah** అను వారికి లోన్ ఇవ్వబడును. కావున ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల 7 రోజులలో తెల్పమని కోరడమైనది.

SCHEDULE OF THE PROPERTY

All that piece and Parcel of land Plot No.43,situated in Kurnool Registration district, Dhone Sub Registration district, in Survey bearing no **230**, in ward no **15**, of Veldurthy Village and Mdl, Kurnool Dt,. **Measurements:** East-West : 15 feet or 4.56 meters, North-South : 42 feet or 12.768 meters, Total : **70** Sq.Yards or 58.22 sq meters. **Boundaries: East:** Plot No.44 belongs to Dasari Parvathamma, **West:** Plot No.42 belongs to Dasari Madilety, **North:** Road, **South:** Yallakesavulu land.

G.Madhusudhana Rao
Advocate, Dhone, Kurnool.

వైభవంగా ఉమామహేశ్వర స్వామి కల్యాణం

బనగానపల్లె, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని యా గంటి ఉమామహేశ్వరస్వామి ఆలయం లో మాసశివరాత్రి సందర్భంగా శని వారం స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ఈవో చంద్రుడు, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డబుల్ స్పీడ్



గ్రావెల్‌ను రోలర్‌తో చదును చేస్తున్న దృశ్యం

- మంత్రి బీసీ జనార్దన్ ప్రత్యేక చొరవ
- రూ.12.58 కోట్ల నిధులు విడుదల
- చకచకా రోడ్డు నిర్మాణ పనులు
- హైవేలో కలపాలని పలువురి డిమాండ్

సంజామల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ముదిగేడు నుంచి సంజామల వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఐదేళ్లుగా అధ్వానంగా ఉన్న రోడ్డుపై ప్రయాణించలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆరు కిలో మీటర్ల రోడ్డు అడుగడుగునా గుంతలు పడటంతో నరకయాతన అనుభవించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఈ రోడ్డుకు మోక్షం లభించింది. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ. 12.58 కోట్లు నిధులు విడుదల చేయించారు. పనులు తీసుకున్న కాంట్రాక్టర్ ముదిగేడు నుంచి కుడివైపు గ్రావెల్ తొలించి రోలర్లతో చదును చేయిస్తున్నారు. ఇదే క్రమంలో మెటల్ పనులు కూడా జరుగుతున్నాయి. ఈవైపు పూర్తయ్యాక వాహనాల రాకపోకలు ఇటువైపు మళ్లించి ఎడమవైపు పనులను ప్రారంభించనున్నారు. డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయితే సంజామల గుళ్లదుర్తి మీదుగా నంద్యాల, జమ్మలముడుగు హైవేలో కలిసిపోయి అమరావతి, తిరుపతి బెంగుళూరు వెళ్లే ప్రయాణికులకు మార్గం దగ్గరవుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

మంత్రి బీసీ కృషితోనే..



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కృషితోనే డబుల్ రోడ్డు ఏర్పాటు సాధమైంది. ఏళ్ల తరబడి అధ్వానంగా ఉన్న రహదారిని డబుల్ రోడ్డుగా ఏర్పాటు చేస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం చల్లా రామకృష్ణారెడ్డి తారు రోడ్డును వేయించారు. నాడు వేసిన రోడ్డు ప్రస్తుతం గుంతలమయంగా మారింది.

- ఆర్. మహమ్మద్ హుసేన్, సంజామల

హైవేలో కలపాలి



ముదిగేడు నుంచి సంజామల వరకు వేస్తున్న డబుల్ రోడ్డును గుళ్లదుర్తి వరకు వేయించి నంద్యాల జమ్మలముడుగు హైవేలో కలపాలి. ఈ హైవేలో కలిస్తే ప్రతి మండల కేంద్రానికి అమరావతి మార్గం దగ్గరి అవుతుంది.

- రెడ్డి మగ్బూల్, సంజామల

యేసు మార్గం అనుసరణీయం



ఎస్పీజీ చర్చిలో సందేశాన్ని ఇస్తున్న బిషప్ జార్జి కరోనాలియస్

చాగలమర్రి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యేసు మార్గం అనుసరించాలని నంద్యాల జిల్లా ఇన్‌చార్జి బిషప్ జార్జి కరోనాలియస్ తెలిపారు. శనివారం ముత్యాలపాడు గ్రామంలోని ఎస్పీజీ చర్చి 134 వార్షికోత్సవం సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొత్తగా చర్చి పునఃప్రతిష్ఠ చేసేందుకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గుడి ప్రదక్షిణ నిర్వహించారు. బిషప్ మాట్లాడుతూ ప్రేమ, దయా కలిగి ఉండాలని, దైవమార్గంలో నడవాలని, శాంతియుత జీవనం గడపాలని సూచించారు. చర్చిలో ఫాదర్లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్‌రావు, కార్యదర్శి విలియమ్, సహాయ కార్యదర్శి సాల్మిన్, కోశాధికారి జోసఫ్, డీసరీ చైర్మన్ సంజీవరాజ్, ఫాదర్లు అనిల్‌బాబు, సువార్తయ్య, స్టిఫెన్, జీవరత్నం, విక్టర్, మరో 15 మంది గురువులు, సంఘ పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

రాతిదూలం పోటీల్లో విజేత నంద్యాల ఎద్దులు

ముత్యాలపాడు గ్రామంలో ఎస్పీజీ చర్చి వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీల్లో నంద్యాల జిల్లా అలంకాన్‌పల్లె వృషభారాజములు ప్రథమ స్థానంలో గెలుపొందాయి. వీరికి రూ.50వేలు నగదు దాతలు అందజేశారు. బాపట్ల జిల్లాకు చెందిన ఎద్దులు రెండో స్థానం, నంద్యాల జిల్లా కొత్తపల్లెకు చెందిన ఎద్దులు మూడవ స్థానం, కడప జిల్లా పోతురెడ్డిపల్లె ఎద్దులు నాల్గొవ స్థానం, కడప జిల్లా బాలయ్యగారిపల్లె ఎద్దులు ఐదో స్థానం, ప్రకాశం జిల్లా మర్రివేముల ఎద్దులు ఆరో స్థానం, నంద్యాల జిల్లా గొల్లపల్లి ఎద్దులు ఏడో స్థానంలో నిలిచాయి. వీరికి నగదు బహుమతులను దాతలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేషు రమేష్, డీసరీ చైర్మన్ సంజీవరాజు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

వరాహ స్వామికి ప్రత్యేక పూజలు



స్వామికి పూజలు చేస్తున్న ప్రధాన అర్చకుడు వేణుగోపాలన్

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో శనివారం వరాహ జయంతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు కిడింబి వేణుగోపాలన్ స్వామి ఆధ్వర్యంలో జ్వాలా నరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవార్లకు, శ్రీవరాహ నరసింహ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం శ్రీరంగారావు గోష్టి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గోష్టి సభ్యులు ఏడి రవికాంత్‌చౌదారి, ఏఈ క్రిష్ణయ్య, ఉప్పల ప్రసాద్, కూరపాటి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎగువ అహోబిల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలం భక్త జన సంద్రంగా మారింది. శనివారం పావన నరసింహస్వామి (పాములేటయ్య) వారోత్సవాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిటకిట లాండింది. వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎగువ అహోబిలంలో గరుడాద్రి కొండ భక్తులతో కిటకిటలాడింది.



ఎగువ అహోబిలంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

● నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని నగర పంచాయతీ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పాత సంపు ద్వారానే నీటి సరఫరా చేయాలని నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి సూచించారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ చలంరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం అజెండా చదివి వినిపించారు. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్లు రామాంజనేయులు, మాధవి మాట్లాడుతూ వార్డు సమస్యలను ప్రస్తవించారు. చైర్మన్ స్పందిస్తూ పైపులైన్ లీకేజీ వల్ల నీటి సరఫరా చేయడంలో జాప్యం జరిగిందని, త్వరలో మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కోఆప్షన్ సభ్యులు ఎల్లయ్య మాట్లాడుతూ తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు పాత సంపు ద్వారానే తాగునీరు అందించేందుకు కృషి చేయాలని ఏఈ చరణ్‌కు సూచించారు. సమావేశంలో నగర పంచాయతీ కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

గడ్డి ట్రాక్టరుపై నుంచి పడి వ్యక్తి మృతి

రుద్రవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వరిగడ్డి ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని దక్షిణకొట్టాలు గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకున్నది. ఎస్ఐ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావు(50) అనే టీడీపీ కార్యకర్త వరిగడ్డి లోడు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దాంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, టీడీపీ కార్యకర్త నాగేశ్వర్‌రావు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని టీడీపీ నాయకుడు భూమిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ నాయకులు నాగ నరసింహారెడ్డి పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న టీడీపీ నాయకుడు కృష్ణారెడ్డి

ఆర్థిక వనరులను వినియోగించుకోవాలి

శిరివెళ్ల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళలు ఆర్థిక వనరులను వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి సూచించారు. శిరివెళ్లలోని ఐకేపీ కార్యాల యంలో లోకోస్ ఎమ్మెస్ అండ్ వీవో ప్రొఫైల్, ట్రాన్సాక్షన్ గురించి ఐదు రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఐబీ డీపీఎం కృష్ణమూర్తి, ఏరియా కో-ఆర్డినేటర్ విజయ గోపాల్, ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, సెర్ప్ రిసోర్స్ పర్సన్స్ ఝాన్సీ, యశోద పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవ పల్లకోత్సవం



చెన్నకేశవ, సంజీవరాయ ఉత్సవమూర్తుల ఊరేగింపు

చాగలమర్రి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో మాస శివరాత్రి సందర్భంగా చెన్న కేశవ, సంజీవ రాయ, భీమలింగేశ్వరస్వామి ఉత్సవమూర్తుల పల్లకోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు సంజీవరాయస్వామికి తమల పాకులు సమర్పించి భజన కార్యక్రమాలు నిర్వహించారు. చాగలమర్రి, శెట్టివీడు గ్రామాల సమీపంలోని అభయాంజనేయ, వీరాంజనే య స్వాములకు ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

శిరివెళ్ల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : వేసవిలో మండల కేంద్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి అశ్విన్ కుమార్ శనివారం తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలో మరమ్మతులకు గురైన చేతిపంపులను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయిస్తున్నట్లు వెల్లడించారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, మినీ వాటర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసి క్లోరినేషన్‌చేసిన నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నామన్నారు.

సర్వ నారసింహుడికి విశేష పూజలు

శిరివెళ్ల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో వెలసిన సర్వ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తులు శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు రంగ నాయకులు స్వామి, పవన్‌కుమార్‌శర్మ వేకువజామునే స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన నిర్వహించారు. నంద్యాల, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో బీవీ నరసయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

శిరివెళ్ల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందని మాజీ ఎంపీటీసీ, శిరివెళ్ల మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు కొండబోయిన బాలచంద్రుడు అన్నారు. శిరివెళ్లలో శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా సముద్రంలో చేపల వేట నిషేధ సమయంలో ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ.20 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

డోన్ రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటుందని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, ప్రజా వైద్యశాల బెస్త మల్లికార్జున శనివారం ఒక ప్రకటనలో అన్నారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మత్స్యకార భరోసా పథకాన్ని ప్రారంభించడం హర్షణీయమని పేర్కొన్నారు.

హోత్రమాన్‌దిన్నె యువకుడికి గిన్నిస్‌బుక్ రికార్డ్



అవార్డు అందుకుంటున్న బరిగెల ఆనందరావు

సంజామల,ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హోత్రమాన్‌దిన్నె గ్రామానికి చెందిన బరిగెల ఆనందరావు గిన్నిస్‌బుక్ రికార్డు సొంతం చేసుకున్నాడు. విజయవాడలోని హెలెన్ మిడిల్ స్కూల్‌లో సంగీతం నేర్చుకొని 2024 నవంబరు 1న 18 దేశాల్లోని 1046మందితో స్వరాలు ఆలపించి ఈరికార్డును సొంతం చేసుకున్నారు. శనివారం గిన్నిస్‌బుక్ రికార్డ్ ధృవీకరణ పత్రం, మెడల్స్‌ను విజయవాడలో అందుకున్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

డోన్ రూరల్/టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డోన్ రూరల్ సీఐ రాకేష్ బాబు అన్నారు. శనివారం సాయంత్రం రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు. అలాగే పట్టణంలోని స్థానిక అర్బన్ స్టేషన్‌లో వాహన డ్రైవర్లకు డోన్ అర్బన్ సీఐ ఇంతి యాజ్ బాషా అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. లైసెన్సులు కలిగి ఉండాలని, అతి వేగం ప్రమాదకరమని సూచించారు. అలాగే పట్టణంలోని కొత్తబస్టాండు సమీపంలో ప్రజలకు హెల్మెట్ వాడకం, ట్రాఫిక్ పై అవగాహన కల్పించి వాహనాలు తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి ఉన్నారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం

బనగాన పల్లె, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడులు చేయడం అమానుషమని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. ఉగ్రదాడులను ఖండిస్తూ శనివారం సాయంత్రం హిందూ ముస్లింల భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ, బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్, మంజునాథ్‌రెడ్డి , ఎస్ఐ దుగ్గిరెడ్డి, , పోలీస్ సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొని సంఘీ భావం ప్రకటించారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు సంఘీభావం ప్రకటించి, కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. పెట్రోల్ బంకు కూడలి వద్ద మృతులకు ఆత్మశాంతి కలుగాలని నివాళలర్పిస్తూ మౌనం పాటిం చారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, సమరసత సేవా ఫౌండేషన్, రాష్ట్రీయ స్వయం సేవక్, గణేశ్ ఉత్సవ కమిటీ, వివిధ కులసంఘాలు, వివిధ ముస్లిం పరిరక్షణ కమిటీ సంస్థలు, నాయకులు జగన్నాథరెడ్డి, టంగుటూరు శ్రీనయ్య, మల్లారెడ్డి, శరత్‌కుమార్‌గుప్తా, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకుల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళలర్పించారు. శనివారం రాత్రి ఎమ్మార్పీస్ సీనియర్ నాయకుడు దస్తగిరి ఆధ్వర్యంలో కొలిమిగుండ్లలోని ఎస్సీ కాలనీలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మంలో నారాయణ మాదిగ, బాషా, చిరంజీవి, చిన్నపుల్లన్న, నారాయణ మ్మ, ఇంద్రాణి పాల్గొన్నారు.



కొలిమిగుండ్లలో కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సంజామల : ఉగ్రదాడికి నిరసనగా సంజామలలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మిద్దె వెంకట రాముడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కత్తి ఓబులేసు, నాయకులు చిన్న పెద్దన్న, కాణాల సుంకన్న, బాలగు ర్రం, కార్యకర్తలు పాల్గొన్నారు.

డోన్ టౌన్: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులు అమానుషమని ఎల్ఐసీ ఏజెంట్లు సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి ప్రసాద్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రకాష్ అన్నారు. శనివారం సాయంత్రం డోన్ పాతబస్టాండులో ఎల్ఐసీ ఏజెంట్లు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడులు చేయడం పిరికిపంద చర్య అని అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏజెంట్లు రంగారెడ్డి, రమణారెడ్డి, మాధవస్వామి, నాగేంద్ర, చెన్నకేశవులు, ఆర్‌సీ సుబ్రహ్మణ్యం ఉన్నారు.



బనగానపల్లెలో కొవ్వొత్తుల ర్యాలీలో మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ

బేతంచెర్ల : కశ్మీర్‌లో అమాయకులపై జరిపిన ఉగ్రదాడుల దాడులకు నిరసనగా శనివారం రాత్రి పట్టణంలో మత సామరస్య వేదిక అధ్యక్షుడు నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండులో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ ఉగ్రవాదులు అమాయకులపై విచక్షణారహితంగా కాల్పులు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మారుతి కృష్ణ, నాగమోహన్, గూని నాగరాజు, నారాయణ స్వామి, మహేశ్వరరెడ్డి, భార్గవ్, ఎల్లయ్య మధుశేఖర్, హిందు, ముస్లీం, క్రిస్టియన్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి



వరి పొలాల మీదుగా మృతదేహాన్ని మోసుకెళ్తున్న కానూరు గ్రామస్తులు(ఫైల్‌ఫొటో)

ఆఖరి మజిలీకి అవస్థలు
శ్మశానవాటికలకు దారి లేక ఇబ్బందులు

పెళ్లకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితంలో ఆఖరి మజిలీ అయిన అంత్యక్రియలను నిర్వహించడానికి కూడా పెళ్లకూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అక్కగారిపేట, కానూరు, రావులపాడు తదితర గ్రామాల్లో మృతదేహాలను శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు దారిలేక పడుతున్న ఆయా గ్రామాల ప్రజల బాధలు వర్ణనాతీతం. ఊరికి దూరంగా ఉన్న శ్మశానవాటికకు వెళ్లాలంటే పంట పొలాల గట్లు మీదుగా పడిలేస్తూ మృతదేహాలను తీసుకెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా వర్షాకాలంలో మృతదేహాలను తరలించి అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. శ్మశానవాటికలు కూడా కంపచెట్లతో నిండిపోయి ఉండడంతో దహన కార్యక్రమాలకు అవస్థలు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి శ్మశాన వాటికలకు దారి సౌకర్యం కల్పిండంతో పాటు కంపచెట్లు, వ్యర్థాలను తొలగించి తగిన వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

4నుంచి పోలేరమ్మ జాతర



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) నాయుడుపేట పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ జాతరను వచ్చే నెల 4వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం రాత్రి ఆవిష్కరించారు. 4,5 తేదీల్లో ఘటోత్సవం, 6వ తేదీ రాత్రి అమ్మరాత్రి నిలుపు, 7న అమ్మవారి జాతర, అదేరోజు రాత్రి అమ్మవారి సాగనంపు ఉత్సవం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈవో రవికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జాతర కమిటీ అధ్యక్షుడు నానాపాల సుబ్బారావు, మణి, అరవభూమి శ్రీనివాసులు రెడ్డి, గోపి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, నారాయణ, రవి, వెంకటేశ్వర్లు, ధనుంజయ, మస్తాన్, అశోక్, రామారావు, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధర్మరాజస్వామి ఉత్సవాలు



విద్యుత్ దీపాలకరణలో ధర్మరాజస్వామి ఆలయ ప్రాంగణం

తడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాటంబేడుకుప్పం గ్రామంలో ఉన్న పంచపాండవ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హిడింబి వధ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి మహాభారతం ప్రథమ ఘట్టం అయిన భకాసుర వధ జరిగింది. భీమసేనుడు భకాసురుడిని వధించే సన్నివేశం ఆకట్టుకుంది. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తమిళనాడుకు చెందిన సెలం శరవణ బృందం పాటకచ్చేరితో అలరించగా, దివాకర్ బృందం ఆటపాటలతో ఉర్రూతలూగించింది.

మత్స్యకారులకు అండగా నిలిచేది టీడీపీనే



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, మత్స్యకారులు

చిల్లకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి తోడ్పాటునందించేది టీడీపీనేనని తెలుగు యువత అధికార ప్రతినిధి సతీష్ యాదవ్ అన్నారు. చేపల వేట నిషేధ కాలానికి మత్స్యకార భరోసా కింద రూ.20వేలు ప్రభుత్వం అందజేసిన సందర్భంగా శనివారం మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీకి మత్సకారులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం మత్స్యకారులకు మత్స్యకార భరోసా నగదు రూ.20 వేలు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మత్సకార నాయకులు రామయ్య, వెంకయ్య, సుబ్రహ్మణ్యం, నాగూర్‌బాబు, పోలయ్య, మస్తాన్, పవన్, మౌల పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో మనోహర్ గౌడ్

చిట్టమూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై ఉపాధి హామీ కూలీలకు శనివారం ఎంపీడీవో మనోహర్ గౌడ్ అవగాహన కల్పించారు. మండలంలోని పల్లంపర్తి గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల గురించి వివరించారు. ఎండ తీవ్రంగా ఉండడంతో ఉదయాన్నే పని చేసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో షెల్టర్ ఏర్పాటు, తాగునీరు కూలీలకు అందించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మన్నెముత్తేరి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు కోళ్లమిట్ట, డేగపాలెం, షార్ జైజంక్షన్, గవర్నమెంట్ ఆస్పత్రి రోడ్డు, రాఘవయ్యపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈడీఈ శేఖర్ తెలిపారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు



గాయపడిన నవ్య

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట విన్నమాల జాతీయ రహదారి సమీపంలో లారీ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. నెల్లూరు పట్టణానికి చెందిన నవ్య స్కూటీలో వెళుతుండగా నాయుడుపేట జాతీయ రహదారి సమీపంలో లారీలో ఇనుప ఊచలు మహిళ తలకు తగలడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రురాలు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. సమాచారం అందుకున్న 108సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కోట మండలం గున్నంపడియ వద్ద పూర్తిగా ఎండిపోయిన సొనకాలువ - యమదిన్నెపాళెం వద్ద అడుగంటిన దృశ్యం

అడుగంటిపోతున్న సొనకాలువలు
తీరం ప్రాంతాలకు పొంచిఉన్న నీటి ఎద్దడి ముప్పు

కోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కొన్ని దశాబ్దాలుగా సముద్రతీర ప్రాంత వాసుల కల్పతరువులైన సొనకాలువలు తడి ఆరుతున్నాయి. తీరం ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించే జలధారలు కన్నీటి ధారలవుతున్నాయి. సొన కాలువల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోతుండడంతో తీరం ప్రాంతాలకు ప్రమాదం పొంచి ఉందనే చెప్పాలి. కోట, చిల్లకూరు మండలాల్లో దాదాపుగా 82 సొనకాలువలు ఉన్నాయి. ఇసుక, సిలికాతో కప్పబడి ఉండే సొనకాలువలు భూగర్భ జలాలతో ఎప్పుడూ కళకళలాడుతుండేవి. ఒకటి నుంచి ఐదు అడుగుల లోపే నీరు లభిస్తుండడంతో తీర ప్రాంతాలకు కల్పతరువులుగా ఉండేవి. వర్షాలు పడకపోయినా సొన కాలువల్లో మాత్రం జలధార పుష్కలంగా ఉండే ఈ సొనకాలువలను ఆధారం చేసుకుని వేరుశనగ, పుచ్చ, వరి పంటలను సాగుచేసేవారు. అయితే ఈ ఏడాది కోట మండలంలోని యమదిన్నెపాళెం, గున్నంపడియ, కొత్తపట్నం, శ్రీనివాసనత్రం, కర్లపూడి గ్రామాల్లో ఉన్న సొనకాలువలు పూర్తిగా అడుగంటిపోయాయి. భూగర్భ జలాలు దాదాపుగా పడిపోయాయి. దీంతో సముద్రతీరం వెంబడి ఉన్న సుమారు 15 గ్రామాలకు జల గండం తప్పదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రీ సర్వే సమగ్రంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి, పక్కన రెవెన్యూ అధికారులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రైతులందరి సమక్షంలో రీసర్వే సమగ్రంగా నిర్వహించాలని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. శనివారం సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో రెండో విడత రీసర్వేపై డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెండో విడతలో 15 గ్రామాలను రీ సర్వేకు ఎంపిక చేశామన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో రీ సర్వేను సమగ్రంగా నిర్వహించాలన్నారు. రీ సర్వే నిర్వహించే గ్రామాల్లో ముందస్తుగా రైతులకు, గ్రామస్తులకు సమాచారం ఇవ్వాలన్నారు. తొలి విడతలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సమర్థవంతంగా గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో 200నుంచి 250 ఎకరాల వరకు ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేసుకొని సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, నాయుడుపేట తహసీల్దార్లు నరసింహారావు, శరత్, శైలాకుమారి, రాజేంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి సత్కారం



ఇంద్రజను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

డక్కిలి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం చాపలపల్లి గ్రామానికి చెందిన కలపాటి ఇంద్రజ పదో తరగతి పరీక్షల్లో 594 మార్కులు సాధించి జిల్లాటాపర్‌గా నిలిచింది. ఈ విద్యార్థిని శనివారం మహాజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య, యూటీఎఫ్ నాయకుడు పులకంటా రామయ్య చాపలపల్లి గ్రామానికి వెళ్లి ఇంద్రజ శాలువాతో సత్కరించారు. ఇంగ్లీషు డిక్షనరీ అందజేశారు. స్వీట్లు పంచిపెట్టారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో శనివారం పొనకా మల్లికార్జునరెడ్డి సహకారంతో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము, శివకుమార్‌రెడ్డి, ప్రభాకర్, కరీముల్లా, వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి



సమావేశంలో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతి శిశుమందిరం పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని పాఠశాల కమిటీ సభ్యులు అన్నారు. శనివారం స్థానిక పూలతోట గిరిజన కాలనీలోని సరస్వతి శిశుమందిరం పాఠశాలలో కమిటీ సభ్యులు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు దేశభక్తి, దేశసంస్కృతి, సంప్రదాయాలు, కళలు, యోగా తదితర వాటితో పాటు మెరుగైన బోధన అందించాలన్నారు. తద్వారా విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో యుగంధర్, మురళీ రెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, విశ్వేశ్వరరావు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న విజయ్‌కుమార్

వాకాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టెంకాయల తోపు గిరిజన కాలనీకి చెందిన బండి మునీంద్ర(27) వడదెబ్బతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామా విజయ్‌కుమార్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

క్రికెట్ ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం

గూడూరు అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరులో ఎన్ఆర్ఐ శషాంక్‌రెడ్డి సహకారంతో క్రికెట్ ఉచిత శిక్షణ శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఆర్‌సీసీ సభ్యులు మాట్లాడుతూ 15 ఏళ్ల లోపు ఆటగాళ్లను గుర్తించి వారికి అనుభవం కలిగిన కోచ్‌లతో 45రోజుల పాటు ఉచితంగా క్రికెట్‌లో శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రామ్‌గోపాల్, మస్తాన్, అవినాష్, రాజీవ్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

గోకులకృష్ణలో ప్రాంగణ ఎంపికలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం శ్రీసిటీలో కిమ్‌బెర్లీ క్లార్క్ మల్టీనేషనల్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ముచ్చకాల సురేష్ తెలిపారు. కంపెనీ సీనియర్ మేనేజర్లు శ్రీకాంత్, అనుషా ఇంటర్వ్యూలు నిర్వహించారు. డిప్లమో, ఇంజనీరింగ్‌లో వివిధ విభాగాల నుంచి 25 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు, ఐదుగురు విద్యార్థులను ఇంజనీరింగ్ అసోసియేట్స్‌గా ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

9న ఎన్‌బీకేఆర్‌లో సృజన సదస్సు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మే 9వ తేదీన జరిగే సృజన 2కే25 జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు ఆవిష్కరించారు. సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు దేశంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని ఆవిష్కరణలు చేస్తారు. విద్యార్థుల పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్‌లలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి బహుమతులు అందజేస్తారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ రవీంద్రారెడ్డి, డాక్టర్ రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హౌస్ బ్రేకింగ్ కేసులపై దృష్టిపెట్టండి
జిల్లా నేర సమీక్షలో ఎస్పీ ఆదేశం



జిల్లా స్థాయి నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రేవ్ (మర్డర్, దోపిడీలు, రోడ్డుప్రమాదంలో ఎక్కువమంది చనిపోవడం, అత్యాచారాలు, ఫోక్సో కేసులు) కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, హౌస్ బ్రేకింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. శనివారం తిరుపతిలోని పోలీసు అతిథి గృహంలో జిల్లాస్థాయి నేర సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో ప్రధానంగా గ్రేవ్ కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్లు ఎగ్జిక్యూట్ చేయడం, హౌస్ బ్రేకింగ్ కేసులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సమీక్షించారు. సబ్ డివిజన్ల వారీగా వున్న కేసుల వివరాలు తెలుసుకుని సరిగా పని చేయని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రేవ్ కేసుల పరిష్కారానికి అవసరమైతే ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసుకుని వేగవంతంగా పరిష్కరించాలన్నారు. మిస్సింగ్ కేసులకు సంబంధించి ప్రతి ఫైలునూ పరిశీలించారు. 2021 నుంచి జరిగిన హౌస్ బ్రేకింగ్ కేసులపై ఆరా తీశారు. గూడూరు, నాయుడుపేట, పుత్తూరు సబ్ డివిజన్ల పరిధిలో కేసుల పురోగతిపై వారిని అభినందించారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడేలా ట్రాఫిక్ పోలీసులు పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లు వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు రామకృష్ణ, రవిమనోహరాచారి, నాగభూషణరావు, వెంకట్రావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మా గ్రామం వద్ద చెత్త పోయొద్దు
మున్సిపాలిటీ ట్రాక్టర్లను అడ్డుకున్న పెరిమిటిపాడువాసులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో సేకరించిన చెత్తను మున్సిపల్ సిబ్బంది ట్రాక్టర్‌లో తీసుకెళ్లి పెరిమిటిపాడు వద్దనున్న ప్రభుత్వ భూముల్లో పోసేందుకు ప్రయత్నించారు. ఇందుకు గ్రామస్తులు కొందరు అభ్యంతరం చెబుతూ తమ గ్రామ పరిధిలో చెత్త పోయొద్దంటూ ట్రాక్టర్‌ను అడ్డుకొన్నారు. సూళ్లూరుపేట పట్టణంలో ఉన్న డంపింగ్ యార్డులో పది రోజుల క్రితం చెలరేగిన మంటలు ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదు. దీంతో డంపింగ్ యార్డులో చెత్త పోయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ అధికారులు మండల పరిధిలోని పెరిమిటిపాడు సమీపంలోని ముప్పాలమ్మ ఆలయ సమీపంలోని ప్రభుత్వ భూముల్లో చెత్త డంపింగ్ చేసేందుకు రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి తీసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. శనివారం ట్రాక్టర్లు చెత్తను తీసుకెళ్లడంతో ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ట్రాక్టర్లను వెనుదిరిగాయి.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



పహల్గాం మృతులకు నల్లబ్యాడ్జిలను ధరించి సంతాపం తెలుపుతున్న సునీత సేవాసంస్థ సభ్యులు

గూడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై మారణకాండకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సునీత సేవాసంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. నల్లబ్యాడ్జీలు ధరించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా అయిన భారతదేశం ఉగ్రవాదులు హిందువులనే లక్ష్యంగా చేసుకుని హతమార్చడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

మహిళపై దాడి

ఓజిలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం సగుటూరు వడ్డిపాళెం గ్రామానికి చెందిన దేవళ్ల అంకమ్మపై అదే గ్రామానికి చెందిన మల్లి పద్మమ్మ, ఆమె భర్తతో పాటు మరో ముగ్గురు దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వప్న తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.... అంకమ్మ గ్రామంలోని దుకాణం వద్దకు వెళుతుండగా తమను గేలిచేసిందంటూ అదే గ్రామానికి చెందిన వారు దాడికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా బాధితురాలి మెడలోని బంగారు గొలుసు అపహరణకు గురైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

బాలాయపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) కశ్మీరులోని పహల్గాంలో ఉగ్రదాడుల నేపథ్యంలో మండలంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. శనివారం మన్నూరు క్రాస్ రోడ్డు వద్ద ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు.

సరదాతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

గూడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఈత సరదాతో చిన్నారులు ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గాంధీనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లోని నీటి గుంతల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు సెలవు కావడంతో చిన్నారులు సరదాగా నీటి గుంటలు, బావులు, కాలువల్లోకి ఈతకు వెళుతుంటారన్నారు. నీటి లోతు తెలియక ప్రమాదలకు గురయ్యే అవకాశం ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

విహారయాత్రలు
1) పాపికొండలు, అరకు తేది:09-05-25. 4 రోజులకి 6500/- 2) సరస్వతి పుష్కరాలు (తెలంగాణ) తేది: 17-05-25. 5రోజులకి 9000/- (A/c బస్సు+ రూం+ భోజనం) కె.వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-212068

వర్చూస న్యూ ప్రాజెక్ట్స్
క్రిస్‌సిటీ చేరువలో VIRTUSA వారి హైవే ఫేసింగ్ న్యూ ప్రాజెక్ట్ సుడా అప్రూవల్ లగ్జరీ డెవలప్‌మెంట్స్‌తో అమ్మకానికి సిద్ధంగా ఉన్నవి. బ్యాంకులోను కలదు.
G.M, Cell: 70135 32985
AJR-205633

ప్లాటు కొనబడును
నెల్లూరులోని ముత్తుకూరు రోడ్డు, కనుపర్తిపాడు, కాకుటూరు, బుజబుజ నెల్లూరు, వైపాడు రోడ్డు ఏరియాలోని ప్లాటు కొనబడును. సం.ప్ర. 93464 48054, 79812 46665
AJR-205749

WANTED
★ భూమి ఇన్‌ఫ్రా రియాలిటీ: జీవితంలో ఆర్థికంగా ఎదగాలి అనే తపన, పట్టుదల వున్నవారు మాకు కాల్ చేయండి. మీరు ఎదిగే వరకు సపోర్ట్ & ట్రయినింగ్ ఇస్తాం. ఫోన్: 9618113345 AJH-88

PLOT FOR SALE
తిరుపతి బస్టాండుకు 7Kms, రైల్వే స్టేషన్‌కు 8Kms, దూరంలో మంగళం లోని TUDA Plots లో 40 అడుగుల రోడ్డుకి తూర్పు ముఖము కలిగి చుట్టూ ఇళ్ల మధ్యన 75 అంకణముల Plot అమ్మబడును. Ph. 98668 58628.
AJG-2097

పొలం అమ్మబడును
నెల్లూరుకు 20 కి.మీ దూరంలోని మరుపూరు గ్రామంలో పక్కా డాక్యుమెంట్స్ కలిగిన రోడ్డు సౌకర్యం గల 7 ఎకరముల పొలం అమ్మబడును. సం.ప్ర. సెల్: 93907 22541, 944022 4440
AJR-2831

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి